RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ 14 జూలై 2025 సోమవారం | పేజీలు:12 | వెల రూ. 2.00 | సంపుటి:21 | సంచిక:39

# శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్న రేవంత్‌రెడ్డి







**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** లష్కర్ బోనాల ఉత్సవాల సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మ వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా, ముఖ్యమంత్రి అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తర్వాత అమ్మ వారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరిపై అమ్మ వారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించారు. ఈ ప్రత్యేక పూజల సందర్భంగా మంత్రులు కొండా సురేఖ , పొన్నం ప్రభాకర్ , పొంగులేటి శ్రీనివాస రెడ్డి , అడ్లూరి లక్ష్మణ్ కుమార్ , సలహాదారులు వేం నరేందర్ రెడ్డి , హర్కర వేణుగోపాల్ రావు రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్ , శాసనసభ్యులు దానం నాగేందర్ , శ్రీగణేశ్ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులతో పాటు దక్కన్ మానవ సేవా సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రభుత్వ పాలన

రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

వార్తా 2 లో



## సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అమ్మవారికి తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు



**సికింద్రాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అమ్మవారికి ప్రభుత్వం తరుపున పట్టు వస్త్రాలు సమర్పించి తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు

అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు

మంత్రి పొన్నం ప్రభాకర్

శ్రీ ఉజ్జయిని మహంకాళి బోనాల ఉత్సవాలు సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు

రాష్ట్రమంతా మంచి వర్షాలతో పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని వేడుకున్న



అమ్మవారి బోనాల ఉత్సవాలు అంగరంగవైభవంగా జరుగుతున్నాయి

తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయడం జరిగింది

జూన్ 26 న గోల్కొండ బోనాలతో ప్రారంభమైన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు జూలై 1 బల్కంపేట శ్రీ రేణుకా ఎల్లమ్మ కళ్యాణం ఈరోజు చారిత్రాత్మక లష్కర్ బోనాల ఉత్సవాలు జరుగుతున్నాయి

.సర్వేజన సుఖినోభవంతు అందరూ బాగుండాలని తెలంగాణ సంక్షేమం అభివృద్ధి బాగుండాలని అమ్మవారిని వేడుకున్న

## కోట శ్రీనివాస రావు మృతి పట్ల సంతాపం తెలిపిన

### తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక



ప్రముఖ సినీ నటుడు కోట శ్రీనివాస రావు మృతి పట్ల తెలంగాణ చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి ప్రియాంక సంతాపం తెలిపారు. వైవిధ్యమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్న ఆయన మరణం విచారకరమన్నారు. కళారంగానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. ఎన్నో మధురమైన పాత్రలు.. విలన్ గా, ఆర్టిస్టుగా ఆయన పోషించిన పాత్రలు సినీ ప్రేక్షకుల మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాయన్నారు.వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

## డిల్లీ కి బయలు దేరిన జగ్గారెడ్డి



ఆగస్టు 7న జగ్గారెడ్డి రెడ్డి కూతురు జయరెడ్డి వివాహానికి రాహుల్ గాంధి నీ ఆహ్వానించడానికి బయలు దేరిన జగ్గారెడ్డి

సంగారెడ్డి లోని తన నివాసం రామ్ నగర్ రామ్ మందిర్ గుడి లో జరగనున్న వివాహం

## ఎమ్మెల్సీ కవిత పై మల్లన్న వ్యాఖ్యలు గర్హనీయం... మహేష్ కుమార్ గౌడ్ టీపీసీసీ అధ్యక్షులు



మహిళలను గౌరవించుకోవడం మన సంప్రదాయం.. కవిత పై మల్లన్న చేసిన అనుచిత వ్యాఖ్యలు ఖండించాల్సిందే..మల్లన్న కార్యాలయంపై దాడి చట్ట వ్యతిరేకం ... చట్ట పరిధిలో అందరూ పని చేసుకోవాలి.. మల్లన్న కార్యాలయంపై దాడి, గన్ మెన్ కాల్పులు జరిపిన అంశాలపై వచ్చిన ఫిర్యాదులపై చట్ట పరిధిలో విచారణ జరుగుతుంది.

బిసి బిల్లు, రిజర్వేషన్లు అన్ని కాంగ్రెస్ కృషి ఫలితమే.. బిసి రిజర్వేషన్ల అంశంలో ఇతరులు లబ్ది పొందాలని చూడడం సమంజసం కాదు



ప్రజాబలం

14 జూలై 2025 సోమవారం

# పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రభుత్వ పాలన

**రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి**

**జూలై 14 నాడు నిరుపేదలైన 3 లక్షల 29 వేల కుటుంబాలకు రేషన్ కార్డులు జారీ**

**నేలకొండపల్లి మండలంలో పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన మంత్రివర్యులు పొంగులేటి, కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ఖమ్మం ప్రతినిధి జూలై 13 (ప్రజాబలం) ఖమ్మం** పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే అజెండాగా ప్రభుత్వ పాలన కొనసాగిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాస రెడ్డి, నేలకొండపల్లి మండలంలో ఆదివారం పర్యటించి పలు రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమాల్లో మంత్రి వెంట జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పాల్గొన్నారు సుర్దేపల్లి నుండి బోదులబండ వరకు 2 కోట్ల 50 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు, కోనాయిగూడెం ఎస్సీ కాలనీలో 21 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్ల నిర్మాణానికి, మంగాపురం తండా నుండి నాచేపల్లి బాణాపురం రోడ్డు వరకు 4 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపనలు చేశారు.

ఈ సందర్భంగా మంత్రి వర్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూలి సుర్దేపల్లి గ్రామంలో సుర్దేపల్లి నుంచి బోదులబండ వరకు 2 కోట్ల 50 లక్షలతో నిర్మించనున్న 2 కిలోమీటర్ల బి.టి. రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసుకున్నామని అన్నారు. సుర్దేపల్లి నుంచి కృష్ణాపురం వరకు ఉన్న హై లెవెల్ వంతెనకు అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి 35 లక్షలు మంజూరు చేసుకున్నామని, గ్రామంలో ప్రతి ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మాణ పనులు ఇందిరమ్మ ప్రభుత్వం పూర్తి చేసిందని అన్నారు కోనాయిగూడెం గ్రామంలో 21 లక్షలతో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశామని, ఇప్పటి వరకు 36 లక్షల రూపాయలతో సిమెంట్ రోడ్లు పూర్తి చేసామని అన్నారు. కోనాయిగూడెం నుంచి ఆచార్లగూడెం రోడ్డు మరమ్మత్తు పనులకు కోటి 55 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిందని మంత్రి తెలిపారు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇందిరమ్మ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమాన్ని సమాంతరంగా కొనసాగిస్తుందని అన్నారు. గత పాలకులు అమలు చేసిన మంచి పథకాలను కొనసాగిస్తూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని అన్నారు

పేద ప్రజలకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్, 500 రూపాయలకే గ్యాస్ సిలిండర్, ఉగాది నుండి రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, ఆరోగ్య శ్రీ పరిమితి 10 లక్షలకు పెంపు, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత బస్ ప్రయాణం వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని అన్నారు జూలై 14 నుండి నిరుపేదలకు తెల్ల రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా 3 లక్షల 29 వేల కుటుంబాలకు తెల్ల రేషన్ కార్డులు జారీ చేయనుందని అన్నారు. 22 వేల 500 కోట్లతో ప్రభుత్వం పేద ప్రజల సొంతింటి కల కోసం 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేసిందని అన్నారు. ప్రతి సంవత్సరం ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ఉంటుందని, నిరంతర ప్రక్రియగా ఇందిరమ్మ ఇండ్ల పథకం కొనసాగుతుందని అన్నారు సుర్దేపల్లి గ్రామంలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగంగా జరుగుతు న్నాయని, ఇక్కడ మరిన్ని ఇండ్ల మంజూరుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం సన్న వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాల్ కు 500 రూపాయల బోనస్ అందించిందని మంత్రి తెలిపారు రైతు భరోసా పథకం క్రింద పెట్టుబడి సహాయం ఎకరానికి 10 వేల నుంచి 12 వేల రూపాయలకు పెంచి, 9 రోజులలో 9 వేల కోట్లను జమ చేశామని అన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నాగార్జున సాగర్ కు ముందుగానే వరద వస్తుందని, సంబంధిత ఆ యొక్క రైతులకు సాగునీరు విడుదల చేస్తున్నామని అన్నారు

కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూలి గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను నాణ్యతతో సకాలంలో పూర్తిచేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని రావాలని అన్నారు అర్హులైన పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, మొదటి విడతలో మంజూరైన లబ్ధిదారులు త్వరగా ఇండ్లు నిర్మాణం పూర్తి చేస్తే ప్రతి సోమవారం ప్రభుత్వం మంత్రి చొరవతో చెల్లింపులు చేస్తుందని అన్నారు ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఇసుక ఇబ్బంది కాకుండా చర్యలు తీసుకున్నామని అన్నారు. ఇంటి నిర్మాణ సామాగ్రి ధరలు నియంత్రిం చేందుకు ప్రతి మండలంలో కమిటీ ఏర్పాటు చేశామని, పేదలు నిర్మించుకునేందుకు అవసరమైన పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, నేలకొండపల్లి మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, నేలకొండపల్లి మండల తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపిడివో ఎర్రయ్య, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు

# బీదలు ఓ వైపు బిలియనీర్లు మరోవైపు

దేశ సంపద వికేంద్రీకరణ జరగకుండా కేంద్రీకృతం కావటంతో పేదల, ధనికుల వ్యత్యాసం తీవ్రంగా పెరుగుతూ ఉంది. కొద్ది మంది కోటీశ్వరుల వద్ద సంపద, కొద్ది మంది భూకామందుల వద్ద సాగు భూములు ఉండటంతో, సంపదలు సృష్టించే అత్యధిక మంది గ్రామీణ పేదలు, కార్మికులు , శ్రామికులు సంపదకు దూరంగా ఉన్నారు. పాలక ప్రభుత్వాలు అనుసరిస్తున్న బడా పెట్టుబడిదారుల, బడా భూస్వాముల అనుకూల విధానాలే అందుకు కారణంగా ఉంది. ప్రపంచ వ్యాప్తంగా పేదల సంఖ్య విషయంపై వేర్వేరుగా అనేక నివేదికలు, అంచనాలు ఉన్నాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం 80 కోట్ల, 80 లక్షల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం 101 కోట్ల మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. ఈ 101 కోట్ల పేదల్లో సగం మంది 18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు కాగా, 13.5 శాతం మంది పిల్లలు 18 ఏళ్ల పైబడిన వారు ఉన్నారు. సగం మంది పేదలు పోషకాహార లోపంతో జీవిస్తున్నారు. 83.7% మంది పేదలు గ్రామీణ ప్రాంతంలో నివసిస్తున్నారని ఐక్య రాజ్య సమితి నివేదిక పేర్కొంది. మొత్తం గ్రామీణ జనాభాలో 28% మంది తీవ్ర పేదరికంలో ఉన్నారు. అనేక దేశాల్లో పేదలు ఎక్కువగానే ఉన్నారు. ఇండోనేషియాలో 4 కోట్ల, 70 లక్షల పేదరికంలో ఉన్నారు. ఆ దేశ జనాభాలో ఇది 18% కాగా, అత్యధిక పేదలు ఉన్న దేశాల్లో 5వ స్థానంలో ఉంది. పాకిస్తాన్‌లో 5 కోట్ల, 90 మంది ప్రజలు పేదరికంలో ఉండి, ఆ దేశ జనాభాలో 29% గా ఉన్నారు. అధిక పేదలు ఉన్న దేశాల్లో 4వ స్థానంలో ఉంది. ఆఫ్రికా దేశం నైజీరియాలో 8 కోట్ల, 60 లక్షల మందితో, పేదరికపరంగా 3వ స్థానంలో ఉంది. పేదలు, పేదరికంలో ఉన్న దేశాలు సబ్ సహారా ఆఫ్రికా, దక్షిణాసియాలో ఉన్నాయి.చైనాలో పేదరికం నేడు తక్కువగా ఉంది. 2020లో 5 కోట్ల, 60 లక్షల మంది ఆ దేశ పేదరిక రేటుకు దిగువన ఉన్నారు. దేశ జనాభాలో 1.7 శాతంగా ఉంది. 2025 లో ప్రపంచ బ్యాంకు లెక్కల ప్రకారం పేదరికం 0.7%గా ఉంది. ప్రస్తుతం పేదల సంఖ్య ఎంత అనేది అందుబాటులో లేదు. చైనాలో కూడా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఆదాయ వ్యత్యాసాలు ఉన్నాయి. అమెరికాలో కూడా 2022 సంవత్సరంలో 12.4% పేదల లెక్క బయటపడింది. ఇంకా ఇతర పెట్టుబడిదారీ దేశాల్లోనూ పేదలు గణనీయంగానే ఉన్నారు. భారతదేశంలో 201112 సంవత్సరంలో పేదరికం 27.1% (34.4 కోట్లు)గా ఉంటే, 2022-23 నాటికి 5.3% (7.5 కోట్లకు) తగ్గిందని మోడీ ప్రభుత్వం ప్రచారం చేస్తున్నది. పేదరికం శాతం తగ్గినా, దేశ ప్రజల్లో 22% మంది పేదరికంలో జీవిస్తున్నారు. ప్రపంచ బ్యాంక్ తాజా నివేదిక ప్రకారం దేశంలో 35 కోట్ల మంది కనీస అవసరాలు తీర్చుకోవడంలో ఇబ్బందులు పడుతున్నారు. మోడీ ప్రభుత్వం చెప్పినట్లుగా పేదరికం తగ్గితే 80 కోట్ల మందికి రేషన్ బియ్యం సప్లయ్ చేయటం ఎందుకు? భారతదేశంలో పేదరిక అంచనాపై అనేక మంది భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశారు. దేశంలో దారిద్ర్యరేఖను అంచనా వేయటం, పేదరిక గురించి అనేక కమిటీలు చేసిన నిర్ధారణలు కూడా హాస్యాస్పదంగాను, పేదరికాన్ని అపహాస్యం చేసేవిగా ఉన్నాయి. అమెరికాలో నలుగురు కుటుంబానికి రోజుకి 63 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉంటే పేదలుగా పరిగణిస్తారు. భారతదేశంలో అర డాలర్ కన్నా ఎక్కువ సంపాదించే వారిని పేదలుగా గుర్తించటంలేదు. ప్రపంచ బ్యాంక్ మాత్రం భారత్‌లో 2.3 డాలర్ల కన్నా తక్కువ ఆదాయం ఉన్న వారిని పేదలుగా గుర్తించింది. భారతదేశంలో క్షేత్రస్థాయిలో పేదరికాన్ని అధ్యయనం చేస్తే కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంక్, ఐక్య రాజ్య సమితి చెప్పిన లెక్కలన్నీ తలకిందులు అవుతాయి.ప్రపంచ దేశాల్లో పేదరికం పెరుగుతూ ఉంటే, మరో వైపు బిలియనీర్లు పెరుగుతూ వస్తున్నారు. 2025 నాటికి ప్రపంచ బిలియనీర్ల సంఖ్య 3,030 చేరుకుంది. వారి మొత్తం సంపద 12 లక్షల కోట్ల అమెరికా డాలర్లుగా అంచనాగా ఉంది. ప్రపంచంలో అత్యంత సంపన్నుల జాబితాలో ఎలెన్ మస్క్ అగ్రస్థానంలో ఉన్నాడు. అతని నికర ఆస్తి 377 బిలియన్ (30 లక్షల, 60 వేల కోట్ల రూపాయలు) డాలర్లు. అతని తర్వాత మార్క్ జుకర్ బర్గ్ ఆస్తి 235 బిలియన్ డాలర్లు, జెఫ్ బెజోస్ 227 బిలియన్ డాలర్లతో మూడవ స్థానంలో ఉన్నాడు. వీరు గాక లారీ ఎల్లిసన్ 194 బిలియన్ డాలర్లు, బిల్ గేట్స్ 176 బిలియన్ డాలర్లు, స్టీవ్ బాల్మెర్ 160 బిలియన్ డాలర్లతో ఉన్నారు. భారతదేశంలో 2024లో 191 మంది బిలియనీర్లు ఉంటే, 2025లో వీరి సంఖ్య 284కు చేరింది. బిలియనీర్లలో ప్రపంచంలో మూడవ స్థానంలో ఉంది. 2015 నుండి భారతదేశంలో బిలియనీర్ల అదనంగా 123 మంది పెరిగారు.ముఖేష్ అంబానీ 8 లక్షల, 60 వేల (8.6 ట్రిలియన్ రూపాయలు. ఒక ట్రిలియన్ లక్ష కోట్లు) కోట్ల రూపాయలతో ప్రథమ స్థానంలో ఉంటే, ఆ తర్వాత గౌతమ్ అదానీ 8 లక్షల, 40 (8.4 ట్రిలియన్ల రూపాయలు) వేల కోట్ల రూపాయలతో రెండవ స్థానంలో ఉన్నాడు. ఆ తర్వాత రోష్నినాడర్ ( హెచ్‌సిఎల్ టెక్నాలజీ) 3.5 లక్షల కోట్లు, దిలీప్ షాంఘ్వీ (సన్ ఫార్మా) 2.5 లక్షల కోట్లు, అజీమ్ ప్రేమ్ జీ ( విప్రో) 2.2 లక్షల కోట్లు, కుమార్ మంగళం బిర్లా (ఆదిత్య బిర్లా గ్రూప్) రెండు లక్షల కోట్లు, సైరస్ పూని వల్లా (సీరం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా) 2 లక్షల కోట్ల రూపాయలు, సిరాజ్ (బజాజ్ ఆటో) 1.6 లక్షల కోట్లు, రాధా కిషన్ దమానీ (అవెన్యూ సూపర్ మార్ట్) 4.4 లక్షల కోట్ల రూపాయల సంపద కలిగి ఉన్నారు.భారత బిలియనీర్ల సగటు వార్షిక సంపద 34,514 కోట్లు. దేశంలో వెయ్యి కోట్లు సంపద కలిగి ఉన్న వారి సంఖ్య 1,539 మంది ఉంటే, అందులో 5 వేల కోట్ల సంపద కలిగిన వారు 534 మంది ఉన్నారు. నల్లధనాన్ని పరిగణనలోకి తీసుకుంటే వీరి సంఖ్య ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఒక నివేదిక ప్రకారం భారతదేశంలోని 1% సంపన్నులు దేశసంపదలో 58% కలిగి ఉంటే, దేశంలోని 67 కోట్ల పేదల వద్ద ఒక శాతం సంపద మాత్రమే ఉంది. 13.8% ఉన్న ధనిక రైతుల వద్ద సాగుభూమి 46% ఉంటే, 84%గా ఉన్న చిన్న, సన్నకారు రైతుల వద్ద 47.3% భూమి ఉంది. దేశంలో కేవలం 4.9% భూకామందుల వద్ద 32% భూమి ఉంది. దేశంలోని ఒక పెద్ద భూ కామందు ఒక్క సన్నకారు రైతు కన్నా 45 రెట్లు భూమి కలిగి ఉన్నాడు. ప్రపంచంలో, భారతదేశంలో బడా పారిశ్రామిక వేత్తల, సంపన్నుల, భూ కామందుల వద్ద దేశాల సంపద, సాగు భూములు కేంద్రీకృతమై ఉంది. దాని ఫలితమే అనేక దేశాల్లో అత్యధిక ప్రజలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. గ్రామీణ ఉపాధి, ఉద్యోగ కల్పన , శ్రమకు తగ్గ వేతనం లభించినప్పుడే పేదరికం తొలుగుతుంది. అందుకు సమగ్ర భూసంస్కరణలతో పేదలకు భూపంపిణీ జరగాలి. పరిశ్రమల్లో కార్మికులకు భాగస్వామ్యం ఉండాలి. బడా కోటీశ్వరుల సంపద ప్రజల పరం కావాలి. ఇవి సాధించుకోవటానికి భారతదేశ గ్రామీణ పేదలు, కార్మికులు, నిరుద్యోగులు, యువజనులు దోపిడీ వర్గాల పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. మిగతా ప్రపంచ దేశాల్లో కూడా ఆ విధంగానే ఉద్యమించాలి.

# గిరిజన బాలికను నిమ్స్ లో పరామర్శించిన మంత్రి లక్ష్మణ్ కుమార్:

గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల కుంటాల మండలం నేరడిగొండ పాఠశాలలో 10వ తరగతి
చదువుతున్న కుమారి ఆత్రం త్రివేణి (తండ్రి తులసీరాం) ఆరోగ్య సమస్యలతో బాధపడుతోందని తేదీ 11/7/2025న సాయంత్రం 7.00 PM గంటలకు గమనించబడింది.
తల్లిదండ్రుల సమాచారం ప్రకారం, వేసవి సెలవుల సమయంలో త్రివేణి తలపై కర్ర పడటంతో
గాయమైంది. ఆమెను స్థానిక ఆర్‌ఎంపి వైద్యుడి వద్దకు తీసుకెళ్లారు. అప్పట్లో వాంతులు వచ్చినా, ఇచ్చిన మందులతో తాత్కాలికంగా ఆగిపోయాయి.





ఆమె 20-06-2025 న పాఠశాల పునఃప్రవేశం చేసింది. అయితే, 11-07-2025 సాయంత్రం 7:00 గంటల సమయంలో, నైట్ స్టడీ సమయంలో ఆమె వాంతులు చేయగా, తీవ్రమైన తలనొప్పి ఉందని తెలియజేయడం జరిగింది. వెంటనే ఆమెను నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి (%ూఎజ) %తీసుకెళ్లారు. అక్కడి వైద్యుడు మెరుగైన చికిత్స కోసం ఆమెను రిఫర్ చేశారు. హెడ్ మాస్టర్ మరియు డిప్యూటీ హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఆమెను రాత్రి 9:00 గంటలకు నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం 12-07-2025 రాత్రి 1:00 గంటలకు ఆమెను దేవేందర్ రెడ్డి హాస్పిటల్, నిర్మల్ (ప్రైవేట్ ఆసుపత్రి) లో చేర్పించారు. సిటీ స్కాన్ రిపోర్ట్ ప్రకారం ఆమె మెదడులో రక్తం గడ్డ కట్టినట్టు వైద్యులు తెలియజేశారు. తదుపరి చికిత్స
నిమిత్తం అక్కడి వైద్యులు ఆమెను నిమ్స్ హైదరాబాద్ కు రిఫర్ చేశారు. విద్యార్థిని ఆరోగ్యాన్ని కాపాడేందుకు అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోబడి, వెంటనే మెరుగైన వైద్యానికి ఆమెను రిఫరల్ హాస్పిటల్కి తరలించడమైంది. ప్రస్తుతం ఆమె నిమ్స్ హైదరాబాద్లో నిపుణులైన డాక్టర్ల బృందం నిరంతరం అవసరమైన అన్ని పరీక్షలు చేస్తూ మెరుగైన చికిత్స అందిస్తున్నారు. ఆమెతో పాటు తల్లిదండ్రులు మరియు హెడ్ మాస్టర్ కూడా ఉన్నారు.

ఈ రోజు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిమ్స్ హాస్పిటల్ కు వెళ్లి త్రివేణికి వైద్యం అందిస్తున్న డాక్టర్ల బృందంతో మాట్లాడి అవసరమైన అన్ని చికిత్సలు చేసి అమ్మాయి ఆరోగ్యాన్ని కుదుటపర్చండి అన్నారు. అమ్మాయి తల్లితండ్రులతో మాట్లాడి ప్రభుత్వం ఖర్చుకు వెనుకాడకుండా అమ్మాయి ఆరోగ్య రక్షణకు అన్ని చర్యలు తీసుకుంటుందని భరోసా ఇచ్చారు. మంత్రి వెంట గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. ఎ. శరత్, అదనపు సంచాలకులు వి. సర్వేశ్వర రెడ్డి, ఉప సంచాలకులు దిలీప్ వెళ్ళి అమ్మాయి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు.





సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న హైదరాబాద్ నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి గారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం భక్తులకి ఎలాంటి ఇబ్బందీ లేకుండా అని డిపార్ట్మెంట్ ల సమన్వయం తో అని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రభుత్వం తరుపున 20 కోట్లు మంజూరు చేశారు అని మేయర్ తెలిపారు.

# మూడు పార్టీల నోట అదే పాట

తెలంగాణ రాజకీయ వాతావరణం మళ్లీ వేడెక్కింది. రాబోయే శాసనసభ ఎన్నికల కోసం మూడేళ్ల ముందు నుండే మూడు ప్రధాన రాజకీయ శక్తులు– కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ౹ ఒకే రాగాన్ని ఆలపిస్తున్నాయి: "100 సీట్లు మావే!". అసలు 119 స్థానాలున్న రాష్ట్రంలో ముగ్గురూ మెజారిటీ సాధిస్తామంటూ ధీమాగా ప్రకటించడమంటే ప్రజలను ప్రభావితం చేయాలన్న ప్రయత్నమా? లేక వాస్తవ రాజకీయ శక్తిని చూపించే వ్యూహమా? ఇప్పుడు ప్రధాన ప్రశ్న అదే. అయితే ఇది ఇక 119 సీట్లే గల రాష్ట్రం కాదు. ఓటర్ల సంఖ్య పెరగడం, నియోజక వర్గాల మధ్య జనాభా అసమతుల్యత, రాజ్యాంగం లోని 2002 మూడవ షెడ్యూల్ (84వ సవరణ) ప్రకారం (2002లో 84వ రాజ్యాంగ సవరణ ద్వారా, 2001 జనాభా లెక్కల ఆధారంగా లోక్‌సభ మరియు అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజనను 2026 వరకు స్తంభింప జేయ బడింది) 2026 తరువాత జనాభా లెక్కల ఆధారంగా తిరిగి నియోజక వర్గాల పునర్విభజన జరగవచ్చన్న అంచనాల నేపథ్యంలో తెలంగాణలో 153 నియోజకవర్గాలు ఉండే అవకాశంపైనే చర్చ మొదలైంది. కొన్ని అధికార పార్టీ నేతల ప్రకటనల ప్రకారం ఈ దిశగా కేంద్రం కూడా ఆలోచిస్తోందన్న సంకేతాలున్నాయి. 34 కొత్త నియోజకవర్గాలు వస్తే, సీట్ల సంఖ్యను దాటి అధిక మెజారిటీ సాధించడం రాజకీయ శక్తులకు మరింత ప్రాధాన్యం పొందిన లక్ష్యంగా మారుతుంది. ఈ నేపథ్యంలో "100 సీట్లు మావే" అన్న మాట ఒకప్పుడు ఊహా గానంగా కనిపించినా ౹ ఇప్పుడు అనేక పార్టీలు తమ రాజకీయ వ్యూహాల ఆధారంగా వాస్తవంగా తలపోస్తున్న అంచనాలుగా మారింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీకి ఇది మొదటి ప్రభుత్వం. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చెదరగొట్టి అధికారంలోకి వచ్చిన రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం, యువతను ఆకర్షించే శైలితో పాలన సాగిస్తోంది. బడ్జెట్ పరిమితులు, కేంద్ర మద్దతు లేకపోవడం వంటి సమస్యలు ఉన్నప్పటికీ, హామీల అమలు విషయంలో మొదటి ఏడాదిలోనే స్పష్టమైన సంకేతాలు ఇవ్వాలని ప్రయత్నిస్తోంది. పాఠశాలల పునర్నిర్మాణం (మనా ఊరు–మన బడి), విద్యుత్ సరఫరా, రైతు రుణమాఫీ, రైతు బంధు మొదలైన వాటి అమలు ప్రారంభ దశలో ఉంది. అయితే గ్రామీణ స్థాయిలో పరిపాలన యంత్రాంగం సజావుగా నడవక పోవడం, రాజకీయ పదవుల నియామకాల్లో అసమతుల్యత ౹ వీటిపై అసంతృప్తి కూడా ఉంది. అన్నింటినీ మించి వివిధ జిల్లాలలో నేతల మధ్య ఆధిపత్య పోరు, అంతర్గత అసమ్మతులు, అసంతృప్తులు రాష్ట్ర నాయకత్వానికి మింగుడు పడని అంశాలుగా మారాయి.అయినప్పటికీ, కాంగ్రెస్‌కు లభించిన ప్రజాదరణ రాజకీయంగా మరింత గట్టి పడాలంటే ౹ అభివృద్ధి, సంక్షేమం, నియామకాల విషయంలో నిర్దిష్టత, పారదర్శకత ఉండాలి. అలాంటి ఫలితాలు కనబడితే ౹ రాబోయే 153 సీట్లపై 100కు పైగా గెలుపు" అనే ధైర్యానికి వచ్చే ఆశావాదం ఉంది. మరోవైపు, ఓటమిని ఎదుర్కొని మళ్లీ దూకుడు పంథా లోకి దిగిన బీఆర్ఎస్ పార్టీకి ఇది ఓగొప్ప ఆత్మ పరిశీలనా దశ. రాష్ట్రం ఆవిర్భావానికి కారక శక్తిగా గుర్తింపు పొందిన ఈ పార్టీ, 2014, 2018లో ఘన విజయాల తరువాత 2023లో అధికారాన్ని కోల్పోయింది. ఎన్నికల సమయంలో "మళ్లీ మేమే" అని చెప్పిన పార్టీ అధినేతకు ఈ ఫలితాలు తీవ్రమైన వ్యక్తిగత, రాజకీయ ఎదురుదెబ్బ. అధినేత తనయ జైలు పాలు కావడం, కేసీఆర్, కెటిఆర్, హరీశ్ రావులపై విచారణల పర్వాలు భారసాను నిత్యం కలవర పెడుతున్న అంశాలు. వీటికి ప్రతిస్పందనగా పార్టీలో నేతల మధ్య స్థాయిని మళ్లీ నిర్మించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నా ౹ గ్రామీణ స్థాయిలో ప్రజల్లో విస్తరించిన అసంతృప్తిని పరిష్కరించడమే ప్రధాన కర్తవ్యంగా మారింది. పునర్నిర్మాణంలో కేటీఆర్, హరీష్ రావు వంటి యువ నాయకత్వం పార్టీని నూతన దిశగా నడిపించాలనే శ్రమిస్తోంది. ఇది పూర్తిగా కార్యాచరణగా మారితే ౹ బీఆర్ఎస్ మరోసారి ప్రజల్లోకి వెళ్లే అవకాశం ఉంది. పైగా, పునర్విభజన వల్ల కొత్త నియోజకవర్గాల రాకతో గ్రామీణ ప్రాబల్యాన్ని మళ్ళీ సంపాదించేందుకు బీఆర్ఎస్‌కు అవకాశం ఉంటుంది. అయితే ప్రజల్లో మళ్లీ విశ్వాసం పొందాలంటే, గత పాలన వైఫల్యాలపై స్పష్టమైన సమీక్ష, మార్పు ఉండాలి. లేకపోతే, "100 సీట్లు మాదే" అన్న నినాదం క్యాడర్ స్థాయిలో వినిపించినా, ఓటర్లను మోసగించ దగిన వాస్తవం కాదు. ఇక బీజేపీ విషయానికొస్తే, రాష్ట్రంలో ఇప్పటికీ ప్రాథమిక స్థాయిలో స్థిరమైన సామాజిక బలముండక పోవడం, నాయకత్వ నిర్దిష్టత లేకపోవడం సమస్యలు కావచ్చు. అయినా పార్టీ భావోద్వేగంతో నడుస్తోంది. కేంద్రంలో అధికారంలో ఉన్న స్థాయి, మోదీ నేతృత్వానికి ఉన్న ప్రజాదరణ, హిందుత్వ గణనీయత వంటి అంశాలతో రాష్ట్రంలో ప్రజా మద్దతు పొందే ప్రయత్నం కొనసాగుతోంది. మున్సిపల్, లోకసభ ఎన్నికలు, రాష్ట్ర శాసనసభ సాధారణ, ఉప ఎన్నికలు వంటి వాటిలో అనుకోని విజయాలతో పార్టీ ఆశావాదం పెరిగింది. బండి సంజయ్, ఈటల రాజేందర్, కిషన్ రెడ్డి, ధర్మపురి అరవింద్ వంటి నేతల, రాష్ట్ర నూతన అధ్యక్షుని మధ్య సమన్వయ లోపం, సంఘటిత, సుస్థిర కమాండ్ లేకపోవడం, పల్లె ఓటర్ల వద్ద పార్టీకి స్పష్టమైన హామీలు లేని పరిస్థితి ౹ బీజేపీకి ప్రధాన సవాళ్లుగా నిలుస్తున్నాయి. కానీ, కేంద్ర పునర్విభజన దిశగా అడుగులు వేస్తే ౹ బీజేపీకి 34 కొత్త నియోజకవర్గాల్లో "కమల కదలిక" సృష్టించే అవకాశాన్ని చూపించవచ్చు. అదే సమయంలో ప్రాంతీయ సమస్యలకు పునాదులపై గళమెత్త గలిగితే ౹ కొత్త ఓటింగ్ బేస్‌ను సృష్టించేందుకు శ్రమించవచ్చు.ఇవన్నీ చూస్తే, మూడు ప్రధాన పార్టీలు ఒక్కొక్కటీ 100 సీట్లు అంటూ ప్రచారం చేస్తున్నప్పటికీ, ప్రజలు మాత్రం విభిన్నంగా ఆలోచిస్తున్నారు. ఎన్నికల హామీలు నెరవేర్చని అనుభవం, ప్రాధాన్యత లేని అభ్యర్థుల ఎంపిక, నియోజకవర్గాల్లో ప్రజలకు కనిపించని నాయకత్వం వంటి అంశాలు గతంలో ఓటర్లను తీవ్రంగా నిరాశ పరిచాయి. ఇప్పుడు వారికి మాటలు కాదు, పని చేస్తేనే నమ్మకం. నియోజకవర్గ విభజన వల్ల వచ్చే మార్పులు, ప్రజాభిప్రాయ దిశలు ౹ అన్నింటికీ మించి ప్రజలకు అనుభవం ముఖ్యం. కొత్త సీట్లు రావడం ఒక రాజకీయ అవకాశమైతే ౹ ప్రజలకు ఇది ఓ కొత్త ఆశ. పాలన ఎలా ఉంటుందో, స్థానిక సమస్యల పరిష్కారం ఎటు పోతుందో అన్న అంచనాల ఆధారంగా ఓటింగ్ తీరును తీర్చిదిద్దే అవకాశం ఎక్కువ. అందుచేత, "100 సీట్లు మావే" అన్న నినాదం రాజకీయ నాయకులకు ధైర్యాన్ని నింపే మాట అయి ఉండొచ్చు. కానీ ప్రజలకు మాత్రం ఇది ఒకే మాట కాదు. వారికీ అవసరమైనది: ఆచరణలో మార్పు, పాలనలో పారదర్శకత, అభివృద్ధిలో గమ్యం, నాయకత్వంలో నమ్మకం. 153 సీట్ల వేదికపైకి మారిన తెలంగాణ ఎన్నికల రాజకీయ యుద్ధంలో గెలుపు కేవలం నినాదాల ద్వారానే కాదు ౹ ప్రగతిశీల ప్రజానీకానికి తగిన నాయకత్వాన్ని ప్రతిబింబించగల విశ్వసనీయత ద్వారానే సాధ్యమవుతుంది.

## మౌన శిలలు...

## మానవ నాగరికతకు మూలస్తంభాలు

ఈ భూమి చరిత్రను అక్షరాలుగా వాచకంగా మోస్తూ, మౌనంగా పలికించే జీవన శిలలే రాళ్లు. ప్రకృతి వైవిధ్యానికి ఆధారంగా నిలిచే ఈ ఘన పదార్థాలు, భూమి ఆకృతిలో మౌలిక పాత్ర పోషించడమే కాక, మానవ నాగరికత నిర్మాణానికి మూల స్తంభాలుగా నిలిచాయి. ప్రతి సంవత్సరం జూలై 13న అంతర్జాతీయ రాక్ దినోత్సవంగా నిర్వహించబడే ఈ సందర్భంగా, శిలల ప్రాముఖ్యతను ప్రపంచ వ్యాప్తంగా గుర్తించి, వాటి పరిరక్షణపై అవగాహన కల్పించడమే ముఖ్య ఉద్దేశ్యం. రాళ్లు అనేవి కొన్ని లక్షల నుండి కోట్ల సంవత్సరాల భూగర్భ ప్రక్రియల ఫలితంగా ఏర్పడిన సహజ ఘన పదార్థాలు. ఇవి భూమి లోపల నుండి వెలువడిన లావా చల్ల బడడం, వాతావరణం కారణంగా వేరు చేయబడిన అవశేషాల సమాహారం, లేదా అధిక ఉష్ణోగ్రత, పీడనాల వల్ల తాలూకు రూపాంతరాలే. భౌగోళికంగా రాళ్లను మూడుగా విభజిస్తారు ౹ ఆగ్నేయ శిలలు, అవక్షేప శిలలు, రూపాంతర శిలలు. ఈ శిలలు మనకు భూమి చరిత్రను పఠించ గలిగే ఆధారాలను అందిస్తాయి. శిలాజాల్లో దాగి ఉన్న పురాతన జీవరాశుల అవశేషాలు, శిలా చిత్రాలు, రాతి లిపులు మానవ పరిణామ క్రమానికి దృశ్య రూపంగా మారాయి. ఈ కారణంగా శిలాజ శాస్త్రం, భూగోళ శాస్త్రం, ఖనిజ శాస్త్రం వంటి అనేక శాస్త్రీయ శాఖల అభివృద్ధికి శిలలు ప్రాథమికంగా ఉపయోగ పడుతున్నాయి. నిర్మాణ రంగంలో శిలల ప్రాధాన్యత అత్యంత ప్రాచీనమైంది. హరప్పా, మొహెంజొదారో నుండి ఖజురాహో, ఎల్లోరా, మహాబలిపురం వరకు ౹ భారత దేశపు నిర్మాణ వారసత్వానికి శిలలే పునాది. ఆధునిక యుగంలోనూ గ్రానైట్, మార్బుల్, బసాల్ట్ వంటి శిలలు ఇళ్ల నిర్మాణం, వంతెనలు, రహదారులు, మెట్రో నిర్మాణాల్లో విస్తృతంగా వినియోగించ బడుతున్నాయి. ఒక అంచనా ప్రకారం, ప్రపంచ నిర్మాణ రంగంలో దాదాపు 60 శాతం వరకు ప్రకృతి శిలలు ఉపయోగించ బడుతున్నాయి. ఆర్థిక పరంగా శిలలతో కూడిన ఖనిజ సంపద ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో కీలక భాగం. యునైటెడ్ స్టేట్స్ జియాలాజికల్ సర్వే గణాంకాల ప్రకారం, ప్రపంచ ఖనిజ మార్కెట్ విలువ సుమారు 1.5 ట్రిలియన్ డాలర్లు. భారత్‌లో 2023–24 ఆర్థిక సంవత్సరానికి గనుల పరిశ్రమ విలువ ?1.8 లక్షల కోట్లుగా నమోదైంది. బంగారం, వెండి, వజ్రాలు, రత్నాలు వంటి విలువైన ఖనిజాల ఎగుమతులు విదేశీ మారక ద్రవ్యాన్ని ఆదాయం రూపంలో తీసుకు వస్తున్నాయి. పరిశ్రమలలో సిమెంట్, గాజు, సిరామిక్, స్టీల్ తయారీ వంటి రంగాల్లో శిలలు ముడి సరుకులుగా కీలకంగా ఉంటాయి. వ్యవసాయ రంగంలో సున్నపురాయి వంటి శిలలు నేల ఆమ్లత్వాన్ని తగ్గించడంతో పాటు నేల సారాన్ని మెరుగు పరుస్తాయి. పర్యావరణ పరంగా, శిలల పొరలు నీటి వడపోతను నియంత్రిస్తూ భూగర్భ జల నిల్వలకు సహాయ పడతాయి. ఇది నీటి భద్రతకు కూడా మూలాధారంగా మారుతోంది. శిలలు కేవలం భౌతిక వనరులుగా మాత్రమే కాక, కళా వారసత్వానికి ప్రతీకగా కూడా నిలుస్తున్నాయి. భారతదేశ శిల్ప కళలో శిలలపై చెక్కిన దేవతా విగ్రహాలు, శిలా రూపాలు, ఆలయ నిర్మాణాలు ప్రపంచ కళా రంగానికి గర్వకారణంగా నిలిచాయి. యునెస్కో గుర్తించిన వారసత్వ క్షేత్రాలలో చాలా శిలా నిర్మాణాలే. రత్న శిల్పం, శిలాజ చిత్రలేఖనం వంటి కళారూపాలు భారత దేశానికే ప్రత్యేకమైనవి. ఒక్కో రత్నం ఒక తాత్విక భావనను, ఒక నమ్మకాన్ని ప్రతిబింబిస్తుంది. ఇటీవలి కాలంలో శిలల వినియోగం అనియంత్రితంగా పెరుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 55 బిలియన్ మెట్రిక్ టన్నుల శిలలు తవ్వబడు తున్నాయి. ఇందులో అత్యధిక భాగం నిర్మాణ రంగం కోసం వినియోగించ బడుతోంది. ఈ విపరీత తవ్వకాలు భూమి వైవిధ్యాన్ని భంగపరిచే ప్రమాదం కలిగిస్తున్నాయి. అభివృద్ధి చెందుతున్న దేశాల్లో నియంత్రణలు లేవడం, అక్రమ మైనింగ్ పెరుగుతుండటం పర్యావరణాన్ని తీవ్రమైన ముప్పుకు గురిచేస్తోంది. ఈ నేపథ్యంలో అంతర్జాతీయ రాక్ దినోత్సవం మానవాళికి శిలా సంపదపై చైతన్యం కలిగించే సందేశంగా మారుతుంది. విద్యా సంస్థలు శిలాజాల ప్రదర్శనలు, వర్క్ షాప్‌లు నిర్వహించడం ద్వారా విద్యార్థులలో శాస్త్రీయ దృష్టిని పెంపొందించ వచ్చు. పాలకులు శిలా పరిరక్షణకు నిబంధనల రూపకల్పన చేయడం ద్వారా ప్రకృతి పరిరక్షణకు మద్దతు ఇవ్వాలి. ప్రపంచంలోని ఐస్‌లాండ్, ఆస్ట్రేలియా, అమెరికా వంటి దేశాల్లో ప్రకృతి శిలా నిర్మాణాలను రక్షిత జియోపార్కులుగా అభివృద్ధి చేస్తూ వాటిని విద్య, పర్యాటక కేంద్రాలుగా తీర్చి దిద్దుతున్నారు. భారత్ లోనూ ప్రస్తుతం రెండు గ్లోబల్ జియోపార్కుల ప్రాజెక్టులు యునెస్కో పర్యవేక్షణలో ప్రారంభ దశలో ఉన్నాయి. ఇవి భవిష్యత్తులో శిలా సంరక్షణకు ఆదర్శంగా మారే అవకాశం ఉంది. ఈ సమగ్ర దృష్టితో చూస్తే, శిలలు మన మౌలిక అస్తిత్వానికి మూలంగా ఉన్న శాశ్వత ఆధారాలే. అవి భూమి చరిత్రను తెలియజేసే మూగ వచనాలు, మన సంస్కృతికి ప్రతీకలు, మానవ అభివృద్ధికి మార్గదర్శకాలు. అంతర్జాతీయ రాక్ దినోత్సవం ఈ అర్థాలను గుండె నిండా గుర్తుచేసే సందర్భం. ఈ రోజును మనం ఒక పరివర్తనా దినంగా మార్చాలి – శిలలను కాపాడుదాం, అవగాహన పెంచుదాం, భవిష్యత్తును పరిరక్షిద్దాం. శిలలు... నిశ్శబ్దంగా మాట్లాడే భూమి జీవగాథలు. వాటిని అర్థం చేసుకుని, భవిష్యత్తు తరాలకు వినిపించేలా చేయడం మన బాధ్యత.

## గుత్తి కథలు కథా సాహిత్యానికి మూల స్తంభాలు

తెలుగు సాహిత్య చరిత్రలో, ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో సామాజిక స్పందనను కేంద్రంగా చేసుకొని రచనా ధోరణిని అలవరచుకున్న అరుదైన రచయితల్లో గుత్తి రామకృష్ణ ప్రముఖులు. ఆయన ఒక కథకుడి గానే కాకుండా, పాత్రికేయుడు, ఉద్యమ కారుడిగా ప్రజల జీవితాల్లో మమేకమైన వ్యక్తి. కమ్యూనిస్టు ఆలోచనలకు ఆకర్షితుడై, రాయలసీమ ప్రాంతంలోని అణగారిన వర్గాల సంక్షేమాన్ని రచనల ద్వారా నిగూఢంగా ప్రతిబింబించిన ఆయన్ను అభ్యుదయ కథకుల కాంతివంతమైన ప్రదీప్తిగా పరిగణించవచ్చు. గుత్తి రామకృష్ణ 1915, జూలై 13న అనంతపురం పాత వూరు లో గుత్తి వెంకటప్ప, నారాయణమ్మ దంపతులకు జన్మించారు.

ఆయన బాల్యం, విద్యాభ్యాసంపై విస్తృత సమాచారం లభించక పోయినా, ఆయన రచనలు, ఉద్యమాలలో పాల్గొనడం ద్వారా సమాజంపై ఆయనకు ఉన్న అవగాహన, బాధ్యత స్పష్టమవుతుంది. కమ్యూనిస్టు సిద్ధాంతాల పట్ల ఆసక్తి, రాయలసీమలో పార్టీని స్థాపించడంలో పాల్గొనడం – ఇవన్నీ ఆయనలో ఉన్న సామాజిక స్పృహకు నిదర్శనం. ఆయన పాత్రికేయుడిగా చేసిన సేవలు, ఆ కాలంలో విలక్షణంగా నిలిచాయి. పత్రికా రచన ద్వారా ప్రజలలో చైతన్యం సృష్టించాలన్న తపన ఆయనకు ఉన్నది. ఆయన వ్రాసిన వ్యాసాలు సామాజిక అసమానతలపై ధీటుగా వ్యాఖ్యానించేవి. అన్యాయాలను విమర్శించడంలో, ప్రజల పక్షాన నిలవడంలో ఆయన నిబద్ధత స్పష్టంగా కనిపించేది. స్వాతంత్ర్యానికి పూర్వమే బ్రిటీష్ హయాంలోనే స్వతంత్ర భారత్, ఆకాశవాణి పత్రికలకు జిల్లా సమస్యల గురించి వ్యాసాలు, వార్తలు వ్రాస్తూ ప్రజా సమస్యలను ప్రతిబింబింప జేసేవాడు.

ప్రజాశక్తి, విశాలాంధ్ర, దక్కన్ క్రానికల్, ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతి, ఈనాడు, జనశక్తి, ఉజ్జ్వల, జనత మొదలైన పత్రికలకు తొలి విలేఖరిగా దాదాపు 70 సంవత్సరాలు పత్రికా విలేఖరిగా పనిచేశారు. భారత బంజార సంఘం ప్రోత్సాహంతో బంజారా పత్రికను అనంతపురం నుండి రెండేళ్లపాటు సంపాదకుడిగా ఉండి నడిపారు. జనప్రభ దినపత్రికకు కూడా సంపాదకుడిగా పనిచేశారు.స్వరాజ్య దీపిక, రాయలసీమ జాగృతి వంటి ముఖ్య తెలుగు పత్రికల్లో కూడా ఆయన రచనలు ప్రాచుర్యం పొందినవి. కథకుడిగా గుత్తి రామకృష్ణ చేసిన కృషి తెలుగు సాహిత్యానికి ఒక కొత్త దిశను చూపింది. ముఖ్యంగా రాయలసీమ గ్రామీణ జీవితం, ప్రజల కష్టనష్టాలు, వలసలు, ఆకలి తెగులు వంటి అంశాలు ఆయన కథల్లో ప్రధానంగా దృశ్యమాన మవుతాయి. ఆయన కథల్లో రాయలసీమ మాండలిక భాష, సామాజిక పరిస్థితుల చిత్తశుద్ధి ప్రతిబింబించేవి. హాస్యాన్ని ఆధారంగా చేసుకుని వ్యంగ్యాన్ని బలంగా ఉపయోగించి, తీవ్రమైన విషయాలపై పాఠకుల దృష్టిని సారించ గలిగారు. గుత్తి రామకృష్ణ తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా రాయలసీమలో, అభ్యుదయ భావజాల కథలకు దారితీసిన మార్గదర్శి రచయిత. ఆయన రాసిన కథలు, వ్యాసాలు అప్పటిదాకా కథలో కనిపించని శ్రమజీవుల జీవితాలను, సామాజిక అసమానతలను, వ్యవస్థ పట్ల తిరుగుబాటు ధోరణిని తీసుకు వచ్చాయి. ఇది ఆయన తరాన్ని దాటి, తరువాతి తరపు రచయితలపై స్థిరమైన ప్రభావాన్ని చూపింది. గుత్తి కథలు రాయలసీమను ఒక కథా సాహిత్య పీఠంగా తీర్చిదిద్దాయి.

అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో రచనా అభిరుచితో ఉన్న యువతలో సామాజిక చైతన్యం కలిగించాయి. ముఖ్యంగా గ్రామీణ జీవితం, శ్రమజీవుల సమస్యలు, కులవ్యవస్థపై విమర్శత్మక దృష్టితో కథ రాయాల్సిన అవసరాన్ని గుత్తి కథలే నేర్పాయి. ఆయన రాసిన కథా సంపుటుల్లో "వలస బాట", "సీతమ్మ వీధిలో", "చీకటి రేఖ" ప్రత్యేక ప్రాధాన్యం గలవిగా నిలిచాయి. "వలస బాట"లో వలస కూలీల బాధలను మానవీయ కోణంలో ఆవిష్కరించారు. "సీతమ్మ వీధిలో" సామాజిక అసమానతలపై ధీటుగా వ్రాసిన కథలు పొందు పరిచారు. "చీకటి రేఖ" వంటి రచనల్లో రాజకీయ అవగాహన, శాసన సభల పై విమర్శాత్మక దృష్టి కనిపిస్తుంది. ఆయన కథల్లో మానవతా భావన, సామాజిక చైతన్యం, నైతిక విలువలపై నమ్మకం ప్రధానంగా ప్రతిఫలించాయి. అవి నాటకీయ సంభాషణలు కాని, అలంకారాలు కాని కాకుండా –% జీవితం పట్ల ఆయనకున్న అవగాహన, ప్రజల పట్ల ఉన్న ప్రేమ ప్రతిబింబించేవిగా ఉన్నాయి. వ్యాసకర్తగా ఆయన్ని విశ్లేషించినప్పుడు, ఆయన రచనల్లో భాష సరళంగా ఉంటూ కూడా భావంలో తీవ్రత కలిగి ఉంటుంది. ఆయన వ్యాసాల శైలి విమర్శాత్మకంగా ఉండేను గానీ, వ్యక్తిగత దూషణలకు దూరంగా, సామాజిక న్యాయంపై నిలబడేలా సాగుతుంది. వ్యంగ్యం ఆయన రచనా శైలిలో ప్రధాన సాధనం. ఆనాటి పాలకవర్గాలపై ప్రశ్నలు విసురుతూ, ప్రజల పక్షాన నిలిచే ధైర్యాన్ని ఆయన రచనలు కలిగి ఉండేవి. గుత్తి కథలు సాహిత్యవేత్తలకే కాక, సామాజిక శాస్త్రవేత్తలకు, చరిత్రకారులకు విలువైన పాఠ్య సామగ్రిగా నిలుస్తాయి. శిల్ప పరంగా కాకపోయినా, వాటిలోని జీవం, వాస్తవికత, అభ్యుదయ దృక్పథం వాటిని మేటి కథలుగా నిలబెట్టాయి.

కమ్యూనిస్టు భావజాలాన్ని కథా వస్తువుగా మలచిన తొలి తరం కథకుల్లో ఆయన ప్రాముఖ్యం ప్రత్యేకమైనది. 2009, మే 12వ తేదీన ఆయన మృతి చెందినా, ఆయన రచనలు కాలపరిమితిని దాటి సమకాలీనతను పొందినవిగా ఉన్నాయి. ఆయన సాహిత్యం, పాత్రికేయ సేవలు, ఉద్యమాల పట్ల చూపిన నిబద్ధత భావితరాలకు ప్రేరణగా నిలుస్తాయి. కథను ఉద్యమంగా మలిచిన రచయితగా గుత్తి రామకృష్ణ పేరు తెలుగు సాహిత్య చరిత్రలో పదిలంగా నిలిచి పోతుంది.

## కెనడాపై 35 శాతం టారిఫ్‌లు

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోమారు సుంకాల దాడిని ప్రారంభించారు. వచ్చే నెలలో కెనడా నుంచి వచ్చే దిగుమతులపై 35 శాతం సుంకం విధిస్తామని, ఇతర పలు వాణిజ్య భాగస్వాములపై 15 శాతం లేదా 20 శాతం టారిఫ్‌లను విధించాలని యోచిస్తున్నామని ట్రంప్ తన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ఓ లేఖలో పేర్కొన్నారు. కొత్త రేటు ఆగస్టు 1 నుంచి అమలులోకి వస్తుందని కెనడా ప్రధాన మంత్రి మార్క్ కార్నీకి స్పష్టం చేశారు. దీనిపై కెనడా ప్రతీకారం తీర్చుకోవాలని భావిస్తే ఈ రేటు మరింత పెరుగుతుందని ట్రంప్ హెచ్చరించారు. టారిఫ్‌లపై యూఎస్‌తో చర్చించడం ద్వారా తమ కార్మికులు, వ్యాపారులను కాపాడుకునే ప్రయత్నం చేస్తామని మార్క్ కార్నీ తెలిపారు. ఇప్పటి వరకు కెనడా ఉత్పత్తులపై యుఎస్ 25 శాతం సుంకాలను అమలు చేస్తోంది. దీన్ని మరో 10 శాతం పెంచి 35 శాతానికి చేర్చనుంది. అయితే.. అమెరికా, మెక్సికో, కెనడా ఒప్పందంలో కొన్ని కవర్ చేయబడిన వస్తువులకు మినహాయింపు కొనసాగుతుందని భావిస్తున్నారు. ఇంధనం, ఎరువులపై 10 శాతం సుంకాలను యధాతథంగా కొనసాగించనుందని భావిస్తున్నారు. అయితే ఈ విషయాలపై ట్రంప్ ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని ఒక అడ్మినిస్ట్రేషన్ అధికారి తెలిపారు. కెనడా నుంచి వస్తోన్న ఫెంటానిల్‌పై ట్రంప్ ఆందోళన వ్యక్తం చేశారు. అధిక దిగుమతుల వల్ల అమెరికా వాణిజ్య లోటు పెరుగుతుందని.. ఇది తమ ఆర్థిక వ్యవస్థ, జాతీయ భద్రతకు ముప్పుగా ఉందని పేర్కొన్నారు. 2024లో యూఎస్ సెన్సస్ బ్యూరో డేటా ప్రకారం.. కెనడా నుంచి 413 బిలియన్ డాలర్ల విలువైన వస్తువులను అమెరికాకు దిగుమతి చేసుకుంది. అమెరికా నుంచి కెనడా 349 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులను దిగుమతి చేసుకుంది.కెనడా ఫెంటానిల్ సరఫరాను ఆపివేస్తే తాము ఈ లేఖను సర్దుబాటు చేసే యోచన ఉందని ట్రంప్ పేర్కొన్నారు. "కెనడా ఉత్తర అమెరికాలో ఫెంటానిల్ బెడదను ఆపడానికి కీలకమైన పురోగతి సాధించింది. రెండు దేశాలలోని ప్రజలను రక్షించడానికి, సమాజాలను కాపాడడానికి యునైటెడ్ స్టేట్స్‌తో కలిసి పనిచేయడానికి మేము కట్టుబడి ఉన్నాము," అని కార్నీ మంగళవారం రాత్రి తన ఎక్స్ పోస్ట్‌లో పేర్కొన్నారు.

## ఇరాన్‌కి వెళ్లొద్దు..

## అమెరికన్లకు ట్రంప్ హెచ్చరిక

ఇరాన్‌కి వెళ్లొద్దని అమెరికన్లను అమెరికా హెచ్చరిస్తోంది. ఇరాన్‌కి వెళితే.. కలిగే ప్రమాదాల గురించి అమెరికన్లకు, ఇరానియన్ అమెరికన్లను హెచ్చరిస్తూ కొత్తగా అవగాహనా ప్రచారాన్ని యుస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ చేపట్టింది. తాజాగా అమెరికా విదేశాంగ శాఖ ప్రతినిధి టామీ బ్రూస్ అమెరికన్లను, ముఖ్యంగా ఇరానియన్ వారసత్వం ఉన్నవారిని ఇరాన్‌కు వెళ్లవద్దని కోరారు. గురువారం (జూలై 10) ఆమె మీడియాతో మాట్లాడుతూ.. 'ఇరాన్‌కు ప్రయాణించడం వల్ల కలిగే తీవ్రమైన ప్రమాదాల గురించి అమెరికన్లను, ముఖ్యంగా ఇరానియన్ అమెరికన్లను హెచ్చరిస్తూ..యుఎస్ స్టేట్ విభాగం కొత్త అవగాహన ప్రచారాన్ని చేపట్టింది. ఇరాన్ ద్వంద్వ జాతీయతను గుర్తించదు. నిర్బంధించబడిన యుఎస్ పౌరులకు కాన్సులర్ సేవలను నిరాకరిస్తుంది. బాంబు దాడి ఆగిపోయినప్పటికీ ఇరాన్‌కి వెళ్లడం అంత సురక్షితం కాదు. ఇరాన్‌కు ప్రయాణించకుండా అమెరికన్లను హెచ్చరించడానికి మేము ఒక కొత్త వెబ్‌సైట్‌ను ప్రారంభించాము. ఈ వెబ్‌సైట్‌లో శోధన చేస్తే.. మీకు సులభంగా అర్థమౌతుంది.

# ట్రంప్ ప్రజల శత్రువు

# బ్రెజిల్‌లో పెద్ద ఎత్తున ఆందోళనలు




అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ విధిస్తున్న దారుణమైన టారిఫ్‌లకు వ్యతిరేకంగా బ్రెజిల్‌లో పెద్ద ఎత్తున నిరసనలు జరిగాయి. వేలాది మంది నిరసనకారులు వీధుల్లోకి చేరి ఆందోళనలు జరిపారు. డోనాల్డ్ ట్రంప్ ప్రజల శత్రువు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పలు చోట్ల ఆయన దిష్టిబొమ్మలతో ర్యాలీలు జరిపి దహనం చేశారు. దక్షిణ అమెరికా దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 50 శాతం సుంకం విధిస్తామని ట్రంప్ ఇప్పటికే ప్రకటించిన విషయం విదితమే. అమెరికా అధ్యక్షుడి ప్రకటన తర్వాత బ్రెజిల్‌లో ఈ ఆందోళనలు జరిగాయి. పాలిస్టా అవెన్యూలో ఆందోళనకారులు ఆయన దిష్టిబొమ్మతో ఊరేగింపు జరిపారు. ట్రంప్ టారిఫ్‌లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఆ తర్వాత ట్రంప్ దిష్టిబొమ్మను దహనం చేశారు. సావో పాలోలో జరుగుతున్న ఆందోళనలో నిరసనకారులు అధిక సంఖ్యలో గుమిగూడారు. ట్రంప్ తీరును తీవ్రంగా తప్పుబట్టారు. ట్రంప్, బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారోలోను పోలి ఉన్న ఫేస్ మాస్క్‌లను ధరించి నిరసన వ్యక్తం చేశారు. కాగా సోషల్‌మీడియా మూవ్‌మెంట్స్, యూనియన్లు ఈ ఆందోళనను నిర్వహించాయి. న్యాయమైన ఆర్థిక విధానాలపై డిమాండ్ చేశాయి. ప్రజలను పణంగా పెట్టి, బిలియనీర్లను రక్షించటాన్ని ఖండించాయి. అయితే 2022 ఎన్నికల్లో ఓటమికి సంబంధించిన విషయంలో అభియోగాలు ఎదుర్కొంటున్న బ్రెజిల్ మాజీ అధ్యక్షుడు బోల్సోనారో ప్రస్తుతం విచారణను ఎదుర్కొంటున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ ట్రంప్ టారిఫ్ వార్‌కు తెరలేపారు.

# ఐక్యరాజ్య సమితివ్యవస్థపైనే దాడి



మానవహక్కులపై ఐక్యరాజ్య సమితి ప్రత్యేక ప్రతినిధి ఫ్రాన్సెస్కా అల్బనీస్‌పై అమెరికా ఆంక్షలు విధించడాన్ని మానవ హక్కుల గ్రూపులు, ఐక్యరాజ్య సమితి అధికారులు తీవ్రంగా ఖండించారు. ఇలా ఐక్యరాజ్య సమితి నిపుణులను అమెరికా లక్ష్యంగా చేసుకోవడం వల్ల అంతర్జాతీయ జవాబుదారీ యంత్రాంగాలకు ముప్పు ఏర్పడుతుంద ని వారు హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయిల్‌లపై అల్బనీస్ రాజకీయ, ఆర్థిక యుద్ధ ప్రచారం జరుపుతున్నారని ఆరోపిస్తూ బుధవారం అమెరికా విదేశాంగ మంత్రి మార్క్ రూబియో ఈ ఆంక్షలను ప్రకటించారు. గాజాలో ఇజ్రాయిల్ సెటిల్‌మెంట్లతో, మిలటరీ ఆపరేషన్లతో 60కిపైగా కంపెనీలు లాభాలార్జిస్తున్నాయని అందులో అమెరికా కేంద్రంగా పనిచేసే లాక్‌హీడ్ మార్టిన్, మైక్రోసాఫ్ట్, కేటర్‌పిల్లర్ తదితరాలు వున్నాయని అల్బనీస్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఒక నివేదికను వెలువరించారు. అది జరిగిన కొద్ది వారాలకే అమెరికా ఆంక్షలు విధించింది. తక్షణమే ఈ మారణకాండపై అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు విచారణ జరపాలని ఆ నివేదిక పిలుపిచ్చింది. తక్షణమే ఆంక్షలను ఎత్తివేయాలని ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల హై కమిషనర్ వోల్కర్ టుర్క్ డిమాండ్ చేశారు. ఐక్యరాజ్య సమితి సభ్య దేశాల మధ్య తీవ్రమైన విభేదాలు, భిన్నాభిప్రాయాలు వున్నప్పటికీ చర్చలు, సంప్రదింపుల ప్రక్రియను అనుసరించాలని ఆయన కోరారు. శిక్షాత్మక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడానికి బదులుగా అర్థవంతమైన చర్చలపై దృష్టి సారించాలని ఆయన కోరారు. ఐక్యరాజ్య సమితిలో స్విట్జర్లాండ్ ప్రతినిధి, ప్రస్తుతం మానవ హక్కుల మండలి అధ్యక్షుడైన జుర్గ్‌లాబర్ మాట్లాడుతూ, అల్బనీస్‌పై ఆంక్షలు పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. బెదిరింపులు లేదా ప్రతీకార చర్యలకు దూరంగా వుండాలని సభ్య దేశాలను కోరారు. ఇటువంటి చర్యలు ప్రమాదకరమైన ప్రమాణాలను నెలకొల్పుతాయని ఐక్యరాజ్య సమితి నిపుణులు హెచ్చరించారు. రష్యా మానవ హక్కుల ప్రతినిధి మరియానా కజరొవా మాట్లాడుతూ అమెరికా తీసుకున్న చర్యతో ఇతర దేశాలు కూడా ఇలాగే వ్యవహరించడానికి వెసులుబాటు కల్పించినట్లవు తుందని అన్నారు. మొత్తంగా ఐక్యరాజ్య సమితి వ్యవస్థపైనే దాడి అని వ్యాఖ్యానించారు. మానవ హక్కుల పర్యవేక్షక సంస్థ హెచ్‌ఆర్‌డబ్ల్యు కూడాఇదే రీతిలో ఆందోళనలు వ్యక్తం చేసింది.

# కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు

# హత్యా బెదిరింపులు



లోక్ జనశక్తి అధినేత, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్‌కు హత్యా బెదిరింపులు వచ్చాయి. చిరాగ్‌ను చంపేస్తామంటూ %@% సోషల్ మీడియా వేదికగా దుండగులు పోస్టులు పెట్టారు. ఈ విషయాన్ని ఎల్‌జెపి ప్రతినిధి రాజేష్ భట్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'టైగర్ మెరాజ్ ఇడిసి' అనే పేరుతో ఇన్‌స్టాగ్రామ్‌లో హత్య బెదిరింపు పోస్టులు పెట్టారని రాజేష్ తెలిపారు. చిరాగ్‌కు పెరుగుతున్న ప్రజాదరణ కారణంగానే ఈ బెదిరింపులు వచ్చాయన్నారు. ఈ బెదిరింపులపై పట్నాలోని సైబర్ పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేశామని, సంబంధిత వ్యక్తిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తున్నామని రాజేష్ భట్ తెలిపారు. బెదిరింపు వెనక తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో అభ్యర్థించినట్లు తెలిపారు. అయితే, ఆ ఇన్‌స్టా అకౌంట్ ఫేక్ అని పోలీసులు గుర్తించినట్లు సమాచారం. కాగా.. ఈ ఏడాది చివర్లో బీహార్‌లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల్లో తాను పోటీ చేస్తానని ఇటీవల చిరాగ్ ప్రకటించారు. రాజకీయాల్లోకి అడుగుపెట్టడానికి కారణమైన బీహార్ ప్రజల కోసం పోటీ చేయనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే హత్యా బెదిరింపులచ్చాయి.

# మయన్మార్‌లోని బౌద్ధ ఆరామంపై వైమానిక దాడి

మయన్మార్‌లోని సెంట్రల్ సాగైంగ్ ప్రాంతంలోని బౌద్ధ ఆరామంపై జరిగిన వైమానిక దాడిలో ఆ ప్రాంగణంలో ఆశ్రమం పొందుతున్న కనీసం 23 మంది మరణించారని ప్రత్యేకవర్గాలు శుక్రవారం తెలిపాయి. దేశంలోని రెండో అతిపెద్ద నగరమైన మండలేకు వాయువ్యంలో 35 కిమీ. దూరంలో ఉన్న ఆశ్రమంలో జరిగిన సంఘటనపై మయన్మార్ సైన్యం ఎటువంటి వ్యాఖ్యలు చేయలేదు. గతంలో, సైన్యం లక్ష్యాలపైనే దాడిచేస్తామని, ప్రతిఘటన దళాలను ఉగ్రవాదులని పేర్కొంది. ఫిబ్రవరి 2021లో ఎన్నికైన ఆంగ్‌సాన్ సూకీ ప్రభుత్వం నుండి సైన్యం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నప్పటి నుండి మయన్మార్ అల్లకల్లోలంగా ఉంది. ఇది అంతర్యుద్ధానికి దారితీసింది. శాంతియుత ప్రదర్శనలను బలప్రయోగం ద్వారా అణచివేసిన తర్వాత సైనిక పాలనను వ్యతిరేకించే వారు ఆయుధాలు చేపట్టారు. మయన్మార్ దేశంలో ఇప్పుడు చాలా ప్రాంతాల్లో ఘర్షణ వాతావరణం ఉంది.

## భారీగా పెరిగిన నిత్యావసర ధరలు..

## ఆహార పదార్థాలు కొనేందుకు బంగారం అమ్మేశాడు!

ఇజ్రాయెల్ చేస్తున్న భీకర దాడులతో గాజాలో పరిస్థితి దారుణంగా తయారైంది. ఆహారం, ఇంధనం, ఔషధాల కొరత తీవ్రంగా ఉందని, ధరలు కూడా భారీగా పెరిగాయని అంతర్జాతీయ మీడియాలో కథనాలు వచ్చాయి. యుద్ధం కారణంగా అక్కడి బ్యాంకులు, ఏటీఎంలు కూడా పని చేయడం లేదు. దీంతో నిత్యావసర వస్తువుల కోసం అక్కడి ప్రజలు అధిక కమీషన్ తీసుకునే దళారులను ఆశ్రయించవలసిన పరిస్థితులు ఏర్పడ్డాయి. బంగారాన్ని కూడా విక్రయించి నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసిన వారు కూడా ఉన్నారు. గాజా వాసులు చాలా లావాదేవీలకు ఇజ్రాయెల్ కరెన్సీ షెకెల్‌ను వినియోగిస్తారు. కానీ టెల్ అవివ్ దీనిని నిలిపివేయడంతో పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారింది. గాజాలోని సంపన్న వర్గాలు బ్యాంకుల నుండి తమ డబ్బును విడిపించుకొని దేశం వదిలి వెళ్లిపోయారు. ప్రస్తుత ఆర్థిక క్లిష్ట పరిస్థితుల్లో మధ్యవర్తులు షెకెల్స్‌ను డాలర్లలోకి మార్చేందుకు 40 శాతం కమీషన్ తీసుకుంటున్నారు. కూరగాయలు, ఆహారం, నీరు, ఔషధాలు.. ఇలా ఏం కొనుగోలు చేయాలన్నా నగదు లేక, ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని షాహిద్ అజ్జూర్ అనే మెడికల్ షాపు యజమాని వాపోయారు. ఆహార పదార్థాల కొనుగోలు కోసం తన వద్ద ఉన్న బంగారాన్ని కూడా విక్రయించానని చెప్పాడు. గతంలో రెండు రోజులకు నాలుగు డాలర్లు ఖర్చు అయ్యేదని, ఇప్పుడు అది 12 డాలర్లకు పెరిగిందని మరో స్థానికుడు వాపోయాడు. యుద్ధానికి ముందు కిలో 2 డాలర్లుగా ఉన్న చక్కెర ధర ఇప్పుడు 80 నుండి 100 డాలర్లకు పెరిగిందని చెప్పాడు. పెట్రోల్ లీటర్ ధర 25 డాలర్లుగా ఉందని వాపోయాడు

# 9 నెలల క్రితం చనిపోయిన పాక్ నటి హుమైరా..

# ఇప్పుడు వెలుగుచూసిన మృతదేహం



పాకిస్తాన్ నటి, మోడల్ హుమైరా అస్గర్ అలీ 9 నెలల క్రితం అంటే 2024 అక్టోబర్ లో మరణించిందని పోలీసులు భావిస్తున్నారు. చాలా కాలంగా ఆమె జాడ తెలియలేదు. కరాచీ లోని ఉన్నత స్థాయి ఇత్తెహాద్ కమర్షియల్ ప్రాంతంలో ఆమె మృతదేహాన్ని ఇప్పుడు కనుగొన్నారు. కుళ్లిపోయిన హుమైరా మృతదేహాన్ని దీంతో మిస్టరీ వీడింది. ఇప్పుడు పోరెన్సిక్ నిపుణులు, పరిశోధకులు రంగంలోకి దిగి డిజిటల్ పాదముద్ర ఆధారంగా ఆమె మరణానికి దారితీసిన సంఘటనలను కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. హుమైరా అద్దెకు ఉంటున్న ప్లాట్ లోకి కోర్టు బెయిలిఫ్ ఒకరు వెళ్లి, ఆ ఇంటి తలుపులు తెరవాలన్న ఉత్తర్వులు అమలు చేసిన తర్వాత ఆమె అవశేషాలు కన్పించాయి. దాదాపు 9 నెలల పాటు చనిపోయిన ఆమెను ఎలా గుర్తించలేక పోయారో ఓ పెద్ద మిస్టరీ. ఈ మొత్తం ఉదంతంపై దర్యాప్తు జరుగుతోంది. హుమైరా మరణం నెల క్రితమే జరిగిందని ప్రాథమిక పోస్ట్ మార్టం నివేదికలు పేర్కొన్నాయి. కానీ ఆమె డిజిటల్ పాదముద్రలు మరో కథను చెప్పాయి. ఆమె కాల్ డిటైల్ రికార్డ్ ప్రకారం చివరి కాల్ 2024 అక్టోబర్ లో జరిగిందని పోలీసు డిప్యూటీ ఇన్ స్పెక్టర్ జనరల్ సయ్యద్ అసద్ రజా వివరించారు. ఫేస్ బుక్ లో ఆమె చివరిగా 2024 సెప్టెంబర్ 11న పోస్ట్ చేశారు. ఇన్ స్టాగ్రామ్ అప్ డేట్ సెప్టెంబర్ 30గా ఉంది. సెప్టెంబర్, అక్టోబర్ తర్వాత ఆమెను తాము ఎవరమూ చూడలేదని ఇరుగు పొరుగు వారు తెలిపారు. ఆమె మరణానికి కారణం ఏమిటో ఇంకా నిర్ధారణ కాలేదు. ఆత్మహత్యా, లేక ప్రమాదామా లేక ఎవరైనా నేరానికి పాల్పడ్డారా అన్న కోణాల్లో దర్యాప్తు జరుగుతోంది. ఫోరెన్సిక్ ప్రక్రియ కొనసాగుతోంది.

# ప్రేమజంటపై ఒడిశాలో అమానుషం..



పెళ్లి చేసుకోవడమే వారు చేసిన తప్పు. యువ జంట వివాహం స్థానిక ఆచారాలకు విరుద్ధం అని పాశవికంగా దాడి చేశారు. వీరి కలయిక సమాజంలో నిషిద్ధం అంటూ ఘోరమైన శిక్షలు వేశారు. అవమానించారు. ఆధునిక యుగంలోకూడా ఇలాంటి ఘటనలు కలవరం చేపుతున్నాయి. ఒడిశాలోని రాయగడ్ జిల్లాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాల్లోకి వెళితే.. అది ఒడిశాలోని రాయగడ జిల్లాలోని కంజామఝిరా గ్రామం.. ఈ గ్రామంలో ఓ యువ జంట స్థానిక ఆచారాలకు విరుద్ధంగా వివాహం చేసుకున్నారని దారుణమైన శిక్షను ఎదుర్కొన్నారు. స్వయాన అత్తకొడుకున్న పెళ్లాడిన యువతికి ఘోర అవమానం, దారుణమైన శిక్ష. అక్కడి సాంప్రదాయ నమ్మకాల ప్రకారం.. వారిది దగ్గర సంబంధంగా భావిస్తారు. వారిద్దరి కలయిక నిషిద్ధం. వివాహం చట్టబద్ధమైనప్పటికీ ఈ సంబంధం తోటి గ్రామస్తుల నుంచి తీవ్ర అభ్యంతరాలను ఎదుర్కొంది. వారు ఈ సంబంధాన్ని ఆమోదయోగ్యం కాని ఆచార ఉల్లంఘనగా భావించారు.

ఎద్దుల్లా పొలం తున్నించారు.. ఆచారం ప్రకారం.. వారు చేసింది తప్పు కాబట్టి శిక్ష అనుభవించాల్సిందే అని గ్రామస్థులు అవమానకరమైన దారుణమైన రీతిలో ప్రవర్తించారు. ఆ జంటను బహిరంగంగా అవమానపర్చారు. వారిని వెదురు ,చెక్క దుంగలతో తయారు చేసిన కాడికి కట్టారు. ఇది ఎద్దులు దున్నడానికి ఉపయోగించే కాడి లాంటిది. ఎద్దులా వారితో పొలం దున్నించారు. దీనికి సబంధించిన వీడియో వైరల్ అవుతోంది.

# బీహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బీజేపీ ప్లాన్



భువనేశ్వర్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిప్పుల చెరిగారు. మహారాష్ట్రలో చేసినట్లుగానే త్వరలో జరిగే బిహార్ ఎన్నికలను హైజాక్ చేసేందుకు బీజేపీ యత్నిస్తోందని ఆరోపించారు. కానీ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా బ్లాక్ పార్టీలు ఈ చర్యను అడ్డుకుంటాయని చెప్పారు. ఒడిశాలోని భువనేశ్వర్‌లో జరిగిన సంవిధాన్ బచావో ర్యాలీలో పాల్గొన్న రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. కేంద్రం ఎన్నికల సంఘం తమ విధులను నిర్వర్తించడం లేదని, బీజేపీకి ప్రయోజనాలు చేకూర్చేందుకు పని చేస్తుందని విమర్శించారు. "కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఐదుగురు పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుంది. దేశంలోని నిరుపేద ప్రజల కోసం పనిచేయట్లేదు. జల్, జమీన్, జంగల్ (నీరు, భూమి, అడవి) ఎప్పటికీ గిరిజనులకు సొంతం. అటవీ హక్కు పట్టాలను గిరిజనులకు ఒడిశా ప్రభుత్వం ఇవ్వడం లేదు. పెసా, ట్రైబల్ బిల్లులను గిరిజనుల కోసం కాంగ్రెస్ తీసుకువచ్చింది. వాటిని అమలు చేసి గిరిజనుల భూమి వారికే దక్కేలా చేస్తాం. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం, గత పాలకులైన బీజేడీ వారిలాగే ఒడిశాను దోచుకుంటుంది." అని రాహుల్ గాంధీ ఆరోపించారు.



# క్రీడలు



## బంతులు బాగాలేవన్న గిల్, సిరాజ్... లార్డ్స్ టెస్టులో 'డ్యూక్స్' బంతి రగడ

భారత్, ఇంగ్లండ్ మధ్య మూడో టెస్టు మ్యాచ్ లో వినియోగిస్తున్న బంతుల నాణ్యతపై టీమిండియా అసంతృప్తి

బంతి ఆకారం త్వరగా మారిపోతోందన్న గిల్, సిరాజ్

అంపైర్ తో వాగ్వాదం!




లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతున్న భారత్-ఇంగ్లండ్ మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్‌లో బంతి వివాదం కలకలం రేపింది. రెండో రోజు ఆటలో భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్, ఫాస్ట్ బౌలర్ మహమ్మద్ సిరాజ్ అంపైర్లతో తీవ్రంగా వాదించారు. డ్యూక్స్ బంతి నాణ్యతపై అసంతృప్తి వ్యక్తం చేసిన భారత జట్టు, దాన్ని మార్చాలని కోరింది. ఈ వివాదం ఆటలో ఆసక్తికరమైన మలుపును తీసుకొచ్చింది.

మ్యాచ్‌లో 91వ ఓవర్‌లో ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో డ్యూక్స్ బంతి ఆకారం కోల్పోయిందని, స్వింగ్ తగ్గిందని భారత జట్టు ఫిర్యాదు చేసింది. అంపైర్ పాల్ రీఫెల్ బంతిని హూప్ టెస్ట్‌లో పరిశీలించి, మార్పిడికి అంగీకరించారు. అయితే, కొత్తగా ఇచ్చిన బంతి కూడా 10 ఓవర్ల బంతిలా కాకుండా, 20 ఓవర్ల పాతదిగా కనిపించిందని గిల్, సిరాజ్ అంపైర్లతో వాగ్వాదానికి దిగారు. “ఇది 10 ఓవర్ల బంతా? సీరియస్‌గానే అంటున్నారా ఈ మాట?” అని సిరాజ్ అంపైర్ ను ప్రశ్నించడం స్టంప్ మైక్‌లో వినిపించింది.

గిల్ కూడా అంపైర్‌తో తీవ్రంగా వాదించి, బంతిని లాక్కున్నాడు. కామెంటరీ బాక్స్‌లో సునీల్ గవాస్కర్ కూడా భారత జట్టు వాదనను సమర్థించారు. ఈ వివాదంపై డ్యూక్స్ బంతి తయారీదారు దిలీప్ జజోడియా స్పందిస్తూ, ఆటగాళ్లు మరింత ఓపికతో, సహేతుకంగా వ్యవహరించాలని కోరారు. “బంతి తయారీలో సహజమైన ముడిసరుకు వాడతాం. దీనివల్ల ప్రతి బంతి పరిపూర్ణంగా ఉండదు. ఆధునిక బ్యాట్‌లు శక్తివంతంగా ఉండటం, ఆటగాళ్లు బలంగా షాట్లు కొట్టడం వల్ల బంతి త్వరగా దెబ్బతింటోంది” అని జజోడియా వివరించారు.

బంతి గట్టిగా ఉండేలా తయారుచేస్తే బ్యాట్‌లు విరిగిపోతాయని, ఆటలో సమతుల్యత దెబ్బతింటుందని ఆయన హెచ్చరించారు. భారత్‌లో డ్యూక్స్ బంతుల వినియోగాన్ని విస్తరించేందుకు బీసీసీఐతో చర్చలు జరుపుతున్నట్లు కూడా ఆయన తెలిపారు.

కాగా, మాజీ ఇంగ్లాండ్ కెప్టెన్ నాసిర్ హుస్సేన్ టీమిండియా సారథి గిల్ నిర్ణయాన్ని తప్పుపట్టాడు. “బంతి స్వింగ్ అవుతుంటే దాన్ని ఎందుకు మార్చారు? ఆ సమయంలో జస్ప్రీత్ బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు” అని హుస్సేన్ వ్యాఖ్యానించారు. ఇంగ్లాండ్ మాజీ పేసర్ స్టీవ్ హార్మిసన్ కూడా భారత జట్టుపై విమర్శలు గుప్పించాడు. ఈ వివాదం ఆటలో ఆసక్తిని పెంచినప్పటికీ, డ్యూక్స్ బంతి నాణ్యతపై చర్చలు మరింత ఊపందుకున్నాయి.

## మీరు ఆడేది క్రికెట్టేనా: ఇంగ్లండ్ ను టార్గెట్ చేసిన గవాస్కర్

లార్డ్స్ లో భారత్-ఇంగ్లండ్ మూడో టెస్టు

మూడో రోజు ఆటలో లెగ్ సైడ్ ఏడుగురు ఫీల్డర్లను మోహరించిన ఇంగ్లండ్

బాడీలైన్ బౌలింగ్ కోసమే ఆ వ్యూహం అంటూ గవాస్కర్ ఆగ్రహం

క్రికెట్ స్ఫూర్తికి ఇది విరుద్ధమని విమర్శలు

ఐసీసీ క్రికెట్ కమిటీ చీఫ్ గంగూలీ దీనిపై స్పందించాలని విజ్ఞప్తి




భారత్-ఇంగ్లండ్ మూడో టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లండ్ జట్టు అనుసరించిన 'బాడీలైన్' వ్యూహాలపై భారత దిగ్గజ క్రికెటర్ సునీల్ గవాస్కర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లార్డ్స్ మైదానంలో నేడు మూడో రోజు ఆటలో, ఇంగ్లండ్ ఏడుగురు ఫీల్డర్లను లెగ్ సైడ్‌లో ఉంచడంపై గవాస్కర్ మండిపడ్డారు.

“ఇది క్రికెట్ కాదు. ఐసీసీ క్రికెట్ కమిటీ అధిపతిగా ఉన్న సౌరభ్ గంగూలీ దీనిపై దృష్టి సారించాలి. దయచేసి లెగ్ సైడ్‌లో ఆరుగురు ఫీల్డర్లను మాత్రమే ఉంచేలా నిబంధనలు సవరించాలి” అని గవాస్కర్ తీవ్ర స్వరంతో అన్నారు. ఇంగ్లండ్ జట్టు కేఎల్ రాహుల్, రిషబ్ పంత్ అద్భుతంగా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఇంగ్లండ్ ఈ వ్యూహాలను ఉపయోగించింది.

ఈ మ్యాచ్‌లో ఇంగ్లండ్ బౌలింగ్‌లో ఎక్కువ బౌన్సర్లు వేయకపోయినప్పటికీ, గవాస్కర్ మాత్రం వారి ఫీల్డింగ్ ప్లేస్‌మెంట్‌ను 'బాడీలైన్' వ్యూహంగా అభివర్ణించారు. క్రికెట్ స్ఫూర్తికి విరుద్ధంగా ఉండే ఇటువంటి వ్యూహాలను అడ్డుకోవాలని ఐసీసీ క్రికెట్ కమిటీ అధిపతి సౌరవ్ గంగూలీకి విజ్ఞప్తి చేశారు.

మూడవ రోజు ఆటలో లంచ్ సమయానికి భారత్ 248 పరుగులకు 4 వికెట్లు కోల్పోయి, ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్ స్కోరు 387 కంటే 139 పరుగులు వెనుకబడి ఉంది. కేఎల్ రాహుల్ 98 పరుగులతో అద్భుతమైన సెంచరీకి చేరువలో ఉండగా, రిషబ్ పంత్ 74 పరుగులు చేసి లంచ్ సమయానికి బెన్ స్టోక్స్ చేతిలో రనౌట్ అయ్యాడు.

## టెన్నిస్ క్రీడాకారిణి రాధికను అందుకే టార్గెట్ చేశారు

రాధికను కాల్చి చంపిన తండ్రి

ఇంట్లో కఠిన ఆంక్షల మధ్య నలిగిపోయిందన్న స్నేహితురాలు హిమాన్షిక

తన ఇష్ట ప్రకారం జీవించడం వల్లే టార్గెట్‌గా మారిందని ఆవేదన




టెన్నిస్ క్రీడాకారిణి రాధిక యాదవ్‌ను ఆమె తండ్రి కాల్చి చంపడంపై ఆమె ప్రాణ స్నేహితురాలు హిమాన్షిక సింగ్ స్పందించింది. రాధిక తనకు 2012 నుంచి తెలుసని, ఆమె తరచూ షార్ట్స్ ధరించేదని, అబ్బాయిలతో మాట్లాడేదని, తన ఇష్టప్రకారం జీవించేదని గుర్తుచేసుకుంది. ఇవే ఆమెను టార్గెట్ చేశాయని, రాధిక కదలికలను ఇంట్లోవారు నియంత్రించారని పేర్కొంది. బయటకు వెళ్లాక ఫలానా సమయంలో తిరిగి ఇంటికి రావాలని ఆంక్షలు విధించేవారని గుర్తుచేసుకుంది.

“ఆమె నాతో వీడియో కాల్‌లో ఉన్నప్పుడు, ఆమె ఎవరితో మాట్లాడుతుందో ఆమె తల్లిదండ్రులకు చూపించాల్సి వచ్చింది. టెన్నిస్ అకాడమీ తన ఇంటి నుంచి కేవలం 15 నిమిషాల దూరంలో ఉన్నప్పటికీ, ఆమె ఎప్పుడు తిరిగి రావాలన్న దానిపై డెడ్‌లైన్ ఉండేది” అని హిమాన్షిక పేర్కొంది.”రాధికది సంప్రదాయ కుటుంబమని, దాదాపు ప్రతిదానితోనూ సమస్యలు ఉండేవని తెలిపింది. ప్రతి విషయంలోనూ నియంత్రణ విధిస్తూ రాధిక జీవితాన్ని ఆమె తండ్రి దుర్భరం చేశాడని హిమాన్షిక ఆవేదన వ్యక్తంచేసింది.

“అతను తన నియంత్రణ, ప్రవర్తన, నిరంతర విమర్శలతో కుమార్తె జీవితాన్ని సంవత్సరాలుగా దుర్భరంగా మార్చాడు. షార్ట్స్ ధరించినందుకు, అబ్బాయిలతో మాట్లాడినందుకు, తన సొంత నిబంధనల ప్రకారం జీవించినందుకు వారు ఆమెను అవమానించారు” అని పేర్కొంది. హిమాన్షిక తన ప్రాణ స్నేహితురాలిని, ఆమె ఎంతో మంచిదని వివరించింది. వీడియోలు చిత్రీకరించడం, ఫోటోలు తీయడాన్ని రాధిక ఇష్టపడుతుందని కూడా ఆమె చెప్పింది.

“క్రమంగా వీడియోలు చిత్రీకరించడం వంటి ఆమె అభిరుచులన్నీ కనుమరుగయ్యాయి. ఆమె ఇంట్లో తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. కుటుంబంపై సామాజిక ఒత్తిడి ఉంది. ప్రజలు ఏమనుకుంటారో అని తల్లిదండ్రులు ఎల్లప్పుడూ ఆందోళన చెందేవారు. వారు చాలా సనాతనవాదులు” అని వివరించింది. ఇంట్లోని ఆంక్షలతో ఆమె ఊపిరాడనట్టు ఉండేదని హిమాన్షిక సింగ్ పేర్కొంది.

## టీమిండియాకు ఆధిక్యం దక్కలేదు... స్కోర్లు సమం!

లార్డ్స్ లో భారత్ వర్సెస్ ఇంగ్లండ్

తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఇంగ్లండ్ ఆలౌట్

సరిగ్గా టీమిండియా కూడా తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులకు ఆలౌట్




లండన్‌లోని లార్డ్స్ వేదికగా జరుగుతున్న భారత్-ఇంగ్లండ్ మూడో టెస్ట్ మ్యాచ్‌లో రెండు జట్ల తొలి ఇన్నింగ్స్ స్కోర్లు సమం కావడంతో ఉత్కంఠ రేగింది. నేడు మూడో రోజు ఆటలో భారత జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 119.2 ఓవర్లలో 387 పరుగులకు ఆలౌట్ అయింది. అంతకుముందు, ఈ మ్యాచ్ లో టాస్ గెలిచిన ఇంగ్లండ్ కూడా తొలి ఇన్నింగ్స్ లో 387 పరుగులే చేసింది.

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో కేఎల్ రాహుల్ (100) సెంచరీతో అదరగొట్టాడు. రిషబ్ పంత్ (74), రవీంద్ర జడేజా (72) అర్ధసెంచరీలతో జట్టుకు బలం చేకూర్చారు. కరుణ్ నాయర్ (40), నితీశ్ కుమార్ రెడ్డి (30) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో క్రిస్ వోక్స్ 3 వికెట్లు, జోఫ్రా ఆర్చర్, బెన్ స్టోక్స్ చెరో 2 వికెట్లు తీశారు. యశస్వి జైస్వాల్ (13), శుభ్‌మన్ గిల్ (16) నిరాశపరిచారు.

# సినిమా





## కోట శ్రీనివాసరావు మృతితో కన్నీరు పెట్టుకున్న బాబు మోహన్



విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఈ రోజు తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన ఆయన ఎంతో మంది ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. తెలుగు సినిమా కామెడీ చరిత్రలో ఎనలేని కాంబినేషన్ అంటే కోట శ్రీనివాసరావు, బాబు మోహన్‌లది. ఈ ఇద్దరు నటుల జోడీ తెరపై కనిపిస్తే చాలు, నవ్వుల పంట పండేది. అప్పట్లో వీరిద్దరూ కలిసి సినిమా చేస్తే ప్రేక్షకులలో ఓ ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. కామెడీకి కొత్త దారులు చూపిన ఈ కాంబినేషన్ ఎన్నో హిట్ చిత్రాలకు సాక్ష్యమైంది.

కోట శ్రీనివాసరావు %-% బాబు మోహన్ కలసి దాదాపు 60కి పైగా సినిమాల్లో నటించారు. కోట గారి గంభీరమైన డైలాగ్ డెలివరీ, విలక్షణమైన హావభావాలు, మరోవైపు బాబు మోహన్ అమాయకపు మానరిజంతో కూడిన టైమింగ్ కామెడీ ప్రేక్షకులని కడుపుబ్బ నవ్వించేలా చేసేవి. దర్శకులు, నిర్మాతలు వీరిద్దరినీ తమ సినిమాల్లో తప్పకుండా తీసుకునే వారు. వీరి కామెడీ ట్రాక్స్ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాయి. తెరపై వారి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పని చేసేది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో వచ్చిన మామగారు సినిమాలో వీరి కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంది సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించిన ప్రేమ విజేత చిత్రంలో వీరి సంభాషణలు బాగా పాపులర్ అయ్యాయి. సీతారత్నం గారి అబ్బాయి సినిమాలో కామెడీ సన్నివేశాలు నవ్వుల పంట పండించాయి.

అహ నా పెళ్ళంట చిత్రంలో బాబు మోహన్ కనిపించకపోయినప్పటికీ, కోట శ్రీనివాసరావు పోషించిన పిసినిగొట్టు లక్ష్మీపతి పాత్ర తెలుగు సినిమా కామెడీలో ఒక ఐకానిక్ క్యారెక్టర్‌గా నిలిచిపోయింది. కోట శ్రీనివాసరావు %-% బాబు మోహన్ జంట తెలుగు సినిమా హాస్యానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని అందించింది. ఇప్పుడు కోట తనని వదిలి వెళ్లారని తెలిసి భావోద్వేగానికి గురయ్యారు బాబు మోహన్. కోట మరణం బాధాకరం. నిన్న రాత్రి కూడా ఆయనతో మాట్లాడాను.కోట మరణ వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది అని కన్నీరు పెట్టుకున్నారు బాబు మోహన్. ఇక కోట మరణ వార్త తెలుసుకున్న చాలా మంది సినిమా ప్రముఖులు షూటింగ్ క్యాన్సిల్ చేసుకొని ఆయనకు నివాళులు అర్పించేందుకు హైదరాబాద్‌కి వస్తున్నారు.

## అనసూయని కూడా భలే బురిడి కొట్టించారుగా.. వారిపై ఫుల్ ఫైర్




ఈ మధ్య ఆన్‌లైన్ మోసాలు చాలా ఎక్కువగా జరుగుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు కూడా మోసాల బారిన పడతున్నారు. తాజాగా అందాల నటి అనసూయ తాను మోసపోయినట్టు చెప్పి షాకిచ్చింది. బుల్లితెరపై యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ భరద్వాజ్, ఇప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటిగా సత్తా చాటుతుంది.

అనసూయని కూడా భలే బురిడి కొట్టించారుగా.. వారిపై ఫుల్ ఫైర్

%ూఞుంబఝు% ఎ ఈ మధ్య ఆన్‌లైన్ మోసాలు చాలా ఎక్కువగా జరుగుతుండడం మనం చూస్తూనే ఉన్నాం. సామాన్యులతో పాటు సెలబ్రిటీలు కూడా మోసాల బారిన పడతున్నారు. తాజాగా అందాల నటి అనసూయ తాను మోసపోయినట్టు చెప్పి షాకిచ్చింది. బుల్లితెరపై యాంకర్‌గా కెరీర్‌ను ప్రారంభించిన అనసూయ భరద్వాజ్, ఇప్పుడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో నటిగా సత్తా చాటుతుంది. తన యాక్టింగ్‌తో ప్రేక్షకుల మన్ననలు పొందుతూ, గ్లామర్‌తో అభిమానులను ఆకట్టుకుంటోంది.రామ్ చరణ్-సుకుమార్ కాంబినేషన్‌లో వచ్చిన 'రంగస్థలం' చిత్రంలో ఆమె పోషించిన 'రంగమ్మత్త ' పాత్ర అనసూయ కెరీర్‌కు మైలురాయిగా నిలిచింది. ఆ సినిమాతోనే విమర్శకుల ప్రశంసలు సొంతం చేసుకుంది.

సోషల్ మీడియాలో అనసూయ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. అప్పుడప్పుడు తన గ్లామర్ పిక్స్ కూడా షేర్ చేస్తుంటుంది. అయితే తాజాగా అనసూయ సోషల్ మీడియాలో తన బాధను పంచుకుంది. తాను ఓ ఆన్‌లైన్ మోసానికి గురయ్యానని చెప్పి, ఆ అనుభవాన్ని అభిమానులతో షేర్ చేసుకుంది. గత నెల అనే క్లాతింగ్ వెబ్‌సైట్‌లో దుస్తులను ఆర్డర్ చేసిందట అనసూయ. అయితే ఆర్డర్ సమయంలో ముందే డబ్బులు చెల్లించింది .కానీ ఇప్పటివరకు వస్తువులు రాకపోగా, రీఫండ్ కూడా కాలేదు.. దీంతో సొంతంగా దుస్తులు అమ్ముతున్నామంటూ డబ్బులు కాజేస్తున్నారు అంటూ ఆ వెబ్‌సైట్‌పై మండిపడింది. ఈ విషయాన్ని మొదట బయటపెట్టకూడదని అనుకున్నాను, కానీ ఇతరులు తన మాదిరిగా మోసానికి గురవ్వకూడదనే ఉద్దేశంతో ఈ పోస్ట్ చేశానని అనసూయ వివరించింది.ఇలాంటి ఆన్‌లైన్ మోసాలు అనసూయకే కాక, ఎన్నో మందికి ఎదురవుతున్నాయి. డిజిటల్ లైఫ్ పెరుగుతున్న కొద్దీ, ఫేక్ వెబ్‌సైట్లు, మోసపూరిత సేవల నుంచి వినియోగదారులు మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం పెరుగుతోంది.ఇక ప్రస్తుతం అనసూయ రెండు తమిళ సినిమాల్లో నటిస్తోంది. తెలుగులో పలు రియాలిటీ షోలలోనూ కనిపించి సందడి చేస్తుంది. చివరగా పుష్ప 2 సినిమాలో దాక్షాయణి పాత్రలో కనిపించి మెప్పించిన విషయం తెలిసిందే.

# రేణు దేశాయ్‌కి సర్జరీ...?

### మరోసారి వార్తల్లో నిలిచిన రేణు దేశాయ్
### సర్జరీ తర్వాత నా క్యూటీతో కలిసి డిన్నర్‌కు వెళ్లాను అంటూ ఇన్‌స్టాలో రేణు దేశాయ్ పోస్టు
### అసలు రేణు దేశాయ్‌కు ఏమైందంటూ అభిమానుల్లో చర్చ

నటి రేణు దేశాయ్ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో ఒక పోస్ట్ ద్వారా మరోసారి వార్తల్లో నిలిచింది. కుమార్తె ఆద్యతో కలిసి డిన్నర్‌కు వెళ్ళిన రేణు దేశాయ్, సెల్ఫీకి ఫోజు ఇచ్చి దానిని సోషల్ మీడియాలో పంచుకుంది. "సర్జరీ తర్వాత నా క్యూటీతో కలిసి డిన్నర్‌కు వెళ్ళాను" అని ఆమె ఆ పోస్ట్‌లో రాసుకొచ్చింది. అయితే, ఈ పోస్ట్ ఇప్పుడు అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. రేణు దేశాయ్ "సర్జరీ తర్వాత" అని పేర్కొనడంతో, ఆమెకు ఏమైందని అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే, రేణు దేశాయ్ తనకు ఏ సర్జరీ జరిగిందో, ఎన్ని రోజులు ఆసుపత్రిలో ఉన్నారో వంటి వివరాలను మాత్రం వెల్లడించలేదు. పవన్ కల్యాణ్‌తో 2012లో విడాకులు తీసుకున్న తర్వాత రేణు దేశాయ్ చాలా కాలం పాటు సినీ పరిశ్రమకు దూరంగా ఉంది. టైగర్ నాగేశ్వరరావు సినిమాతో ఆమె మళ్ళీ వెండితెరకు రీ ఎంట్రీ ఇచ్చింది. ఇటీవల రెండు సినిమాలకు సంతకం చేసినట్లు ఒక ఇంటర్వ్యూలో రేణు దేశాయ్ తెలిపింది. ప్రస్తుతం రేణు దేశాయ్ ఈ ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది, ఆమె సర్జరీ గురించి అభిమానుల్లో చర్చ జరుగుతోంది.

# విలక్షణ నటుడు కోటాశ్రీనివాసరావు కన్నుమూత

### అనారోగ్యంతో ఈ తెల్లవారుజామున కన్నుమూత
### విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకులను అలరించిన కోటా
### నాలుగు దశాబ్దాల ప్రయాణంలో 750కిపైగా సినిమాలు



విలక్షణ నటుడు కోటా శ్రీనివాసరావు ఈ ఉదయం కన్నుమూశారు. వందలాది సినిమాల్లో నటించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసి 'కోటా'గా చిరపరిచితులైన ఆయన ఈ తెల్లవారుజామున ఫిలింనగర్‌లోని ఆయన నివాసంలో అనారోగ్యంతో తుదిశ్వాస విడిచారు. ఆయన వయసు 83 సంవత్సరాలు. కోటా శ్రీనివాసరావు 1942 జులై 10న కృష్ణా జిల్లా కంకిపాడులో జన్మించారు. 1968లో రుక్మిణిని వివాహం చేసుకున్నారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు సంతానం. కొడుకు కోటా ప్రసాద్ 21 జూన్ 2010లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. నాలుగు దశాబ్దాలపాటు తెలుగు తెరను ఏలిన ఆయన 750కి పైగా సినిమాల్లో నటించారు.

కోటా శ్రీనివాసరావు సినిమాల్లోకి రాకముందు భారతీయ స్టేట్ బ్యాంకులో పనిచేశారు. తన నటనతో విలనిజానికి కొత్త భాష్యం చెప్పిన ఆయన రంగస్థల నటుడిగా ఎన్నో ఏళ్లపాటు అలరించారు. ప్రాణం ఖరీదు సినిమాతో తెలుగు తెరకు పరిచయమయ్యారు. కెరియర్ తొలినాళ్లలో సహాయ నటుడిగా, విలన్‌గా నటించారు. టాలీవుడ్ అగ్రహీరోలు సూపర్ స్టార్ కృష్ణ, చిరంజీవి, నాగార్జున, బాలకృష్ణ, వెంకటేశ్, మహేశ్‌బాబు, పవన్ కల్యాణ్, సాయిధరమ్ తేజ్ వంటి పాత, కొత్తతరం నటులతో కలిసి నటించారు. ప్రతిఘటన సినిమాతో ఆయన పేరు తెలుగు చిత్ర పరిశ్రమలో మార్మోగిపోయింది. అహనా పెళ్లంట సినిమా ఆయనలోని మరో నటుడిని వెలికితీసింది. అందులో ఆయన నటించిన పిసినారి పాత్ర నభూతో నభవిష్యత్. ఇక, ఖైదీ నంబర్ 786, యముడికి మొగుడు, బొబ్బిలి రాజా, యమలీల, శివ, సంతోషం, బొమ్మరిల్లు, అతడు, రేసుగుర్రం, ఇంట్లో ఇల్లాలు.. వంటింట్లో ప్రియురాలు వంటి సినిమాలు ఆయనకు ఎనలేని

## కోట శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకి తీరని లోటు.. చిరంజీవి సంతాపం



ప్రముఖ సినీనటుడు కోట శ్రీనివాసరావు మృతిపట్ల అగ్ర కథానాయకుడు చిరంజీవి సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎక్స్ వేదికగా ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు.

లెజెండరీ నటులు, బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీ కోట శ్రీనివాస రావు గారు ఇక లేరనే వార్త నన్ను తీవ్రంగా కలిచివేసింది. 'ప్రాణం ఖరీదు' చిత్రంతో ఆయన, నేను ఒకేసారి సినీ కెరీర్‌ను ప్రారంభించాం. ఆ తర్వాత వందలాది సినిమాల్లో ఎన్నెన్నో విభిన్నమైన పాత్రల్లో నటించి, ప్రతి పాత్రనీ తన విలక్షణమైన, ప్రత్యేక శైలితో అలరించి తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు.

కామెడీ విలన్‌గా అయినా, సీరియస్ విలన్‌గా అయినా, సహాయక పాత్రలైనా.. ఆయన పోషించిన ప్రతి పాత్ర 'ఆయన మాత్రమే చేయగలడు' అన్నంత గొప్పగా నటించారు. ఇటీవలి కాలంలో ఆయన కుటుంబంలో జరిగిన వ్యక్తిగత విషాదం ఆయన్ని మానసికంగా ఎంతగానో కుంగదీసింది. కోట శ్రీనివాస రావు గారి లాంటి నటుడి లోటు చిత్ర పరిశ్రమకి, సినీ ప్రియులకి ఎన్నటికీ తీరనిది. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ, ఆయన కుటుంబ సభ్యులకి, శ్రేయోభిలాషులకి, అభిమానులకి నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. అంటూ చిరు రాసుకోచ్చాడు.

## 'కోట' కూలిపోయింది: తనికెళ్ల భరణి

### కోటా శ్రీనివాసరావు మృతికి పలువురు సంతాపం
### సినీ రంగానికి తీరని లోటన్న సీఎం రేవంత్‌రెడ్డి
### నాలుగు దశాబ్దాలపాటు కలిసి పనిచేశామన్న బ్రహ్మానందం

ఈ ఉదయం కన్నుమూసిన ప్రముఖ సినీ నటుడు కోటా శ్రీనివాసరావుకు పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు. నాలుగు దశాబ్దాలపాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఆయన మృతి తెలుగు సినీ రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరించారు: రేవంత్‌రెడ్డి

కోటా శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారం వ్యక్తంచేశారు. ఆయన తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరించారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

కోట సినీ ప్రస్థానం స్ఫూర్తిదాయకం: తనికెళ్ల భరణి

కోటా శ్రీనివాసరావుతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న ప్రముఖ నటుడు తనికెళ్ల భరణి.. ఆయన మృతితో సినీ పరిశ్రమ 'కోట' కూలిపోయిందని పేర్కొన్నారు. సామాన్య మధ్యతరగతి కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదిగిన ఆయన సినీ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. నాటకాలపై ఉండే ఎనలేని ఆసక్తే ఆయన సినీ రంగ ప్రవేశానికి దారులు వేసిందన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు మనో ధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరారు.

నమ్మలేకపోతున్నా: బ్రహ్మానందం

కోటా శ్రీనివాసరావు లేరన్న విషయాన్ని నమ్మలేకపోతున్నానని సీనియర్ నటుడు బ్రహ్మానందం అన్నారు. నటన ఉన్నంతకాలం ఆయన ఉంటారని పేర్కొన్నారు. ఏ విషయాన్ని అయినా నిర్మొహమాటంగా మాట్లాడే వ్యక్తి అని కొనియాడారు. నాలుగు దశాబ్దాలపాటు తాము కలిసి పనిచేశామని బ్రహ్మానందం గుర్తుచేసుకున్నారు. కోటా శ్రీనివాసరావును చూస్తూ, ఆయనను ఆరాధిస్తూ, ఆయన నుంచి నేర్చుకుంటూ పెరిగానని ప్రముఖ నటుడు రవితేజ అన్నారు. ఆయనతో కలిసి పనిచేసిన క్షణాలు తనకు మధుర జ్ఞాపకాలన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.



# వ్యాపారం




## హైదరాబాద్‌లో విన్‌ఫాస్ట్ షోరూం




గురుగ్రామ్, జూలై 12: వియత్నాంకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ విన్‌ఫాస్ట్ అనుబంధ సంస్థయైన విన్‌ఫాస్ట్ ఆటో ఇండి యా.. దేశవ్యాప్తంగా తన వ్యాపారాన్ని శరవేగంగా విస్తరిస్తున్నట్టు ప్రకటించింది. ఈ ఏడాది చివరినాటికి దేశవ్యాప్తంగా 32 షోరూంలను తెరిచేందుకు 13 డీలర్ల గ్రూపులతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. ఈ ఒప్పందంలో భాగంగా 27 నగరాల్లో 32 షోరూంలను తెరుస్తున్నది. ఈ ఒప్పందంలో భాగంగా ఒకేచోట 3ఎస్ (సేల్స్, సర్వీసెస్, స్పేర్లు) అందించడంతోపాటు వీఎఫ్ 6, వీఎఫ్7 మా డళ్లను ఈ నెల 15 నుంచి ముందస్తు బుకింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది. ఢిల్లీతోపాటు గురుగ్రామ్, నోయిడా, చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, పూణె, జైపూర్, అహ్మదాబాద్, కోల్‌కతా, కొచ్చిన్, భువనేశ్వర్, తిరువనంతపురం, ఛండీగఢ్, లక్నోల్లో డీలర్‌షిప్‌లను నెలకొల్పబోతున్నది. ఈ నగరాల్లో ఈవీ వాహనాలకు డిమాండ్ అధికంగా ఉన్నదని, ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, చార్జింగ్ స్టేషన్లు అధికంగా ఉండటం వల్లనే వీటిని ఎంపికచేసినట్టు విన్‌ఫాస్ట్ ఆసియా సీఈవో ఫామ్ సన్హా చౌ తెలిపారు.

## ఇండియన్ మార్కెట్‌లోకి ఎంట్రీ..
## కీలక ప్రకటన చేసిన టెస్లా




Teslaప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కు చెందిన లగ్జరీ ఎలక్ట్రిక్ కార్ల తయారీ దిగ్గజం టెస్లా (%ువంశ్రీఖ%) భారత్‌లో అడుగుపెట్టేందుకు సిద్ధమవుతోంది. దేశ ఆర్థిక రాజధాని ముంబైలో తొలి షోరూం ప్రారంభించనున్నట్లు తెలిసింది. జులై 15న టెస్లా భారత్‌లో తొలి షోరూంను అఫీషియల్‌గా లాంఛ్ చేయనున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇండియన్ మార్కెట్‌లోకి ఎంట్రీపై టెస్లా తాజాగా కీలక ప్రకటన చేసింది. ఈ మేరకు 'టెస్లా ఇండియా' పేరుతో ఎక్స్ ఖాతాను తెరిచింది. అందులో తొలి పోస్ట్‌గా 'కమింగ్ సూన్' అంటూ ఓ ఫొటోను డ్రాప్ చేసింది. ఈ ఏడాది జులైలో భారత విపణిలోకి అడుగుపెట్టనున్నట్లు అఫీషియల్‌గా ప్రకటించింది.

## టాటా ఈవీలపై భారీ డిస్కౌంట్ రూ.50 వేల
## వరకు రాయితీ ఇస్తున్న సంస్థ




న్యూఢిల్లీ, జూలై 12: కొనుగోలుదారులను ఆకట్టుకోవడానికి ఆటోమొబైల్ దిగ్గజాలు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. ఒకవైపు ధరలను పెంచుతూనే మరోవైపు రాయితీల రూపంలో కస్టమర్లను కొనుగోళ్ల వైపు ఆకర్షిస్తున్నాయి. దీంట్లోభాగంగా ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్..తన ఈవీ మాడళ్లపై రూ.50 వేల వరకు రాయితీ ఇస్తున్నట్టు ప్రకటించింది.

ప్రస్తుతం సంస్థ కర్వ్ ఈవీ, హారియర్ ఈవీలను తగ్గింపు ధరతో విక్రయిస్తున్నది. స్వల్పకాలం మాత్రమే అందుబాటులోవుండనున్న ఈ ఆఫర్ ఎంపిక చేసిన నగరాల్లో అందిస్తున్నది. టాటా టియాగో ఈవీపై రూ.40 వేల వరకు ప్రయోజనాలు పొందవచ్చునని తెలిపింది. దీంట్లో రూ.20 వేలు నగదు రూపంలో డిస్కౌంట్, మరో రూ.20 వేలు ఎక్సేంజ్ బోనస్ కింద పొందవచ్చునని తెలిపింది.

అలాగే టాటా పంచ్ ఈవీపై కూడా రూ.20 వేల నగదు ప్రయోజనాలు, మరో రూ.20 వేలు ఎక్సేంజ్ బోనస్ కింద లభించనున్నాయి. అలాగే మార్కెట్లో అత్యంత ప్రజాదరణ పొందిన నెక్సాన్ మాడల్‌పై రూ.30 వేలు డిస్కౌంట్ కల్పిస్తున్నది. దీంతోపాటు అదనంగా ఆరు నెలలపాటు ఉచితంగా చార్జింగ్, లాయల్టీ ప్రయోజనాలు కూడా అందిస్తున్నది. అలాగే కర్వ్ ఈవీపై రూ.50 వేల వరకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించింది. దీంతోపాటు ఆరు నెలలపాటు టాటా పవర్ చార్జింగ్ స్టేషన్లలో ఉచితంగా చార్జింగ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

## యూరోపియన్ దేశాలకు ట్రంప్ షాక్



యూరోపియన్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ షాకిచ్చారు. ఆయా దేశాల నుంచి దిగుమతవుతున్న వస్తువులపై 30 శాతం టారిఫ్‌ను విధిస్తున్నట్టు శనివారం ప్రకటించారు. దీంతో ఫ్రెంచ్, ఇటలీ, జర్మనీ, స్పానిష్ దేశాల నుంచి దిగుమతవుత్ను చీజ్, లెదర్ గూడ్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల ధరలు మరింత పెరగనున్నాయి.

యూరోపియన్ దేశాలకు ట్రంప్ షాక్

30 శాతం టారిఫ్‌ను విధించిన అమెరికా అధ్యక్షుడు

ఫ్రాంక్‌ఫర్ట్(జర్మనీ), జూలై 12: యూరోపియన్ దేశాలకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారీ షాకిచ్చారు. ఆయా దేశాల నుంచి దిగుమతవుతున్న వస్తువులపై 30 శాతం టారిఫ్‌ను విధిస్తున్నట్టు శనివారం ప్రకటించారు. దీంతో ఫ్రెంచ్, ఇటలీ, జర్మనీ, స్పానిష్ దేశాల నుంచి దిగుమతవుత్ను చీజ్, లెదర్ గూడ్స్, ఎలక్ట్రానిక్స్, ఫార్మాస్యూటికల్స్ ఉత్పత్తుల ధరలు మరింత పెరగనున్నాయి.

ఈయూ దేశాలకు చెందిన ఉత్పత్తులపై 20 శాతం ప్రతీకార సుంకాలను విధించనున్నట్టు ఏప్రిల్ నెలలో ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ తర్వాతి క్రమంలో ఈ సుంకాన్ని 50 శాతానికి పెంచిన్న ట్రంప్..ఈసారి కాస్త కరుణించి 30 శాతానికి కుదించారు. ప్రతీకార సుంకాల విధింపుపై 27 మంది సభ్యులు కలిగిన ఈయూ ఎగ్జిక్యూటివ్ కమిషన్ అధ్యక్షుడు దీనిపై ఆశావాదంతో ఉన్నారు.

యూరోపియన్ దేశాలు కూడా..

అమెరికా విధించిన ప్రతీకార సుంకాలకు బదులుగా యూరోపియన్ దేశాలు కూడా అంతే స్థాయిలో పన్ను విధించడానికి సిద్ధమవుతున్నాయి. అమెరికా నుంచి దిగుమతి అవుతున్న గొడ్డు మాంసం, వాహన విడిభాగాలు, బీర్లు, బోయింగ్ విమానాల తయారీలో వినియోగించే కీలక విడిభాగాలు సైతం అధికంకానున్నాయి.

ప్రస్తుతం యూరోపియన్-అమెరికా దేశాల మధ్య 2024లో 1.7 ట్రిలియన్ యూరోలు(2 ట్రిలియన్ డాలర్లు) మేర వాణిజ్యం జరిగింది. సరాసరిగా రోజుకు 4.6 బిలియన్ యూరోల వాణిజ్యం జరిగినట్టు ఈయూ గణాంకాల శాఖ వెల్లడించింది. అమెరికా నుంచి యూరప్‌కు అత్యధికంగా క్రూడాయిల్, ఫార్మాస్యూటికల్స్, ఎయిర్‌క్రాఫ్ట్, ఆటోమొబైల్స్, మెడికల్, దయగ్నిస్టిక్ పరికరాలు ఎగుమతి అవుతున్నాయి. అలాగే యూరోపియన్ దేశాల నుంచి అమెరికాకు ఫార్మాస్యూటికల్స్, కార్లు, ఎయిర్‌క్రాఫ్ట్, కెమికల్స్, మెడికల్ పరికరాలు, వైన్, స్పిరిట్ అవుతున్నాయి.

## లక్షకు చేరువలో పుత్తడి



హైదరాబాద్, జూలై 12: బంగారం ధరలు మళ్లీ భగ్గుమంటున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాలకు డిమాండ్ అధికంగా ఉండటంతో దేశీయంగా ధరలు పుంజుకుంటున్నాయి. హైదరాబాద్ బులియన్ మార్కెట్లో 24 క్యారెట్ పదిగ్రాముల ధర రూ.710 అధికమై రూ.99 వేల నుంచి రూ.99,710కి చేరుకున్నది.

అలాగే 22 క్యారెట్ కలిగిన గోల్డ్ ధర రూ.650 అధికమై రూ.91,400 పలికింది. అంతకుముందు ఇది రూ.90,750గా ఉన్నది. బంగారంతోపాటు వెండి ధరలు భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ అధికంగా ఉండటంతో కిలో వెండి రూ.4 వేలు అధికమై రూ.1.25 లక్షలకు చేరుకున్నది.

## కేటీఎం నయా బైకు..ప్రారంభ ధర
## రూ.3.03 లక్షలు



ప్రీమియం స్పోర్ట్స్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ కేటీఎం..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. అడ్వెంచర్ ఎక్స్ 390 మాడల్‌ను ఆధునీకరించి మళ్లీ విడుదల చేసింది.

కేటీఎం నయా బైకు..ప్రారంభ ధర రూ.3.03 లక్షలు

పుణె, జూలై 12: ప్రీమియం స్పోర్ట్స్ మోటర్‌సైకిళ్ల తయారీ సంస్థ కేటీఎం..దేశీయ మార్కెట్‌కు మరో మాడల్‌ను పరిచయం చేసింది. అడ్వెంచర్ ఎక్స్ 390 మాడల్‌ను ఆధునీకరించి మళ్లీ విడుదల చేసింది.

రెండు రకాల్లో లభించనున్న ఈబైకు రూ.3,03,125, మరో మాడల్ రూ.3,52,825 ధరల్లో లభించనున్నది. ఈ ధరలు పుణె షోరూంనకు సంబంధించినవి. యాంటీ బ్రేక్ సిస్టమ్, క్రూయిజ్ కంట్రోల్, యాంటీ బ్రేకింగ్ సిస్టమ్ వంటి ఫీచర్స్‌తో రూపొందించింది.

health

# ఆరోగ్యం



# ప్రాసెస్డ్ ఫుడ్ కొద్దిగా తిన్నా ముప్పు తప్పదు.. తాజా అధ్యయనంలో షాకింగ్ నిజాలు!

**ప్రాసెస్డ్ ఫుడ్స్ తక్కువ తిన్నా ప్రమాదమేనని తాజా అధ్యయనం**
**మధుమేహం, క్యాన్సర్, గుండె జబ్బుల ముప్పు అధికమని వెల్లడి**
**చక్కెర పానీయాలు, ప్రాసెస్ చేసిన మాంసం అత్యంత హానికరం**
**రోజుకు ఒక సర్వింగ్ తీసుకున్నా రిస్క్ పెరుగుతుందని స్పష్టం**
**వాషింగ్టన్ యూనివర్సిటీ పరిశోధకుల నివేదికలో కీలక అంశాలు**




ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలను మితంగా తీసుకుంటే ఫర్వాలేదనుకోవడం ఒక అపోహ మాత్రమేనని తాజా అధ్యయనం తేల్చిచెప్పింది. ఇలాంటి ఆహారాన్ని చాలా తక్కువ మోతాదులో రోజూ తీసుకున్నా కూడా మధుమేహం, క్యాన్సర్, గుండె జబ్బుల వంటి దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడే ప్రమాదం గణనీయంగా పెరుగుతుందని పరిశోధకులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా ప్రాసెస్ చేసిన మాంసం, చక్కెర కలిపిన శీతల పానీయాలు, ట్రాన్స్ ఫ్యాట్స్ ఉన్న ఆహార పదార్థాలు అత్యంత హానికరమని స్పష్టం చేశారు.

అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ వాషింగ్టన్‌కు చెందిన 'ఇన్‌స్టిట్యూట్ ఫర్ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్' పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. వారి నివేదిక ప్రతిష్ఠాత్మక 'నేచర్ మెడిసిన్' జర్నల్‌లో ప్రచురితమైంది. ఈ అధ్యయనం ప్రకారం, రోజుకు కేవలం 0.6 నుంచి 57 గ్రాముల మధ్య ప్రాసెస్ చేసిన మాంసం తినేవారిలో టైప్ 2 డయాబెటిస్ వచ్చే ప్రమాదం 11 శాతం అధికంగా ఉన్నట్టు కనుగొన్నారు. అలాగే, 0.78 నుంచి 55 గ్రాముల మధ్య తీసుకునే వారిలో పెద్దప్రేగు క్యాన్సర్ ముప్పు 7 శాతం పెరుగుతుందని తేలింది.

ఇక చక్కెర కలిపిన పానీయాల విషయానికొస్తే, రోజుకు 1.5 నుంచి 390 గ్రాముల వరకు తాగేవారిలో టైప్ 2 డయాబెటిస్ రిస్క్ 8 శాతం ఎక్కువగా ఉన్నట్లు పరిశోధనలో వెల్లడైంది. రోజుకు ఒక సర్వింగ్ లేదా అంతకంటే తక్కువ మోతాదులో తీసుకున్నప్పటికీ, వ్యాధుల ముప్పు గణనీయంగా పెరుగుతోందని పరిశోధకులు తెలిపారు.

ప్రాసెస్ చేసిన మాంసాన్ని నిల్వ చేయడానికి ఉపయోగించే రసాయనాల వల్ల శరీరంలో కణితులు ఏర్పడే ప్రమాదం ఉందని, చక్కెర పానీయాలు జీవక్రియ సమస్యలకు దారితీస్తాయని వివరించారు. ఈ నేపథ్యంలో ప్రాసెస్ చేసిన మాంసం, చక్కెర పానీయాలు, ట్రాన్స్ ఫ్యాట్స్ వాడకాన్ని తగ్గించాలని సూచించే ఆహార మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని పరిశోధకులు నొక్కిచెప్పారు.

## మన వంటగదిలోని 'తెల్లటి విషం'.. ఉప్పు వాడకంపై షాకింగ్ నిజాలు

**రోజుకు 5 గ్రాముల ఉప్పు మాత్రమే తినాలని డబ్ల్యూహెచ్ఓ సూచన**
**భారతీయుల సగటు వాడకం రోజుకు 11 గ్రాములుగా వెల్లడి**
**సిఫార్సు కన్నా రెట్టింపు ఉప్పు వాడుతున్న వైనం**
**అధిక వాడకంతో గుండె, కిడ్నీ జబ్బుల తీవ్ర ప్రమాదం**
**2030 నాటికి 90 లక్షల గుండెపోటు కేసులు రావొచ్చని అంచనా**

వంటకాల్లో రుచికి ప్రాణమైన ఉప్పు వాడకంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) కీలక హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా భారతీయులు సిఫార్సు చేసిన దానికంటే దాదాపు రెట్టింపు స్థాయిలో ఉప్పును తీసుకుంటున్నారని, ఇది తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని తాజా నివేదికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాల ప్రకారం, ఒక ఆరోగ్యవంతుడైన వ్యక్తి రోజుకు కేవలం 5 గ్రాముల (ఒక టీస్పూన్) ఉప్పు మాత్రమే తీసుకోవాలి. దీని ద్వారా శరీరానికి అవసరమైన 2 గ్రాముల సోడియం అందుతుంది. అయితే, ఇండియన్ హైపర్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ ఇనిషియేటివ్ నివేదిక ప్రకారం, మన దేశంలో సగటున ఒక వ్యక్తి రోజుకు 10.9 గ్రాముల ఉప్పును వినియోగిస్తున్నారు. ఇది సిఫార్సు చేసిన పరిమితి కన్నా రెట్టింపు కావడం గమనార్హం. కేవలం భారత్‌లోనే కాకుండా చైనాలో 11 గ్రాములు, అమెరికాలో 8.5 గ్రాముల చొప్పున ప్రజలు ఉప్పును అధికంగానే వాడుతున్నట్లు సర్వేలు వెల్లడించాయి.అధిక సోడియం వల్ల హైబీపీ, గుండెపోటు, కిడ్నీ సమస్యలు, జీర్ణాశయ క్యాన్సర్, ఆస్టియోపోరోసిస్ వంటి ప్రాణాంతక వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. 2021లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం రోజువారీ సోడియం వినియోగం కేవలం 1 గ్రాము పెరిగినా గుండె జబ్బులతో మరణించే ప్రమాదం గణనీయంగా పెరుగుతుంది. ఈ ధోరణి ఇలాగే కొనసాగితే 2030 నాటికి సుమారు 90 లక్షల మంది గుండెపోటుకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.కేవలం కూరల్లో నేరుగా వేసే ఉప్పే కాకుండా, మనం రోజూ తినే ఊరగాయలు, అప్పడాలు, చట్నీలు, చిప్స్, బ్రెడ్, బిస్కెట్లు, చీజ్ వంటి ప్యాకేజ్డ్ ఫుడ్స్, రెస్టారెంట్ భోజనం ద్వారా తెలియకుండానే అధిక మోతాదులో ఉప్పు శరీరంలోకి చేరుతోంది. ఈ తరహా ఆహార పదార్థాల వాడకాన్ని తగ్గించుకోవడం ద్వారా ఉప్పు వినియోగాన్ని నియంత్రించి, గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# వయసు 40 దాటిన తర్వాత కూడా కండలు తగ్గకుండా ఉండాలంటే...!

**40 ఏళ్ల వయసు తర్వాత కండర దృఢత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరం**
**వయసు పెరిగే కొద్దీ కండరాల బలం తగ్గడం సహజం**
**కొన్ని ఆహార నియమాలతో కండర పుష్టి**




ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం, 40 ఏళ్లు దాటిన తర్వాత కండర దృఢత్వాన్ని కాపాడుకోవడం ఎంతో కీలకం. వయసు పెరిగే కొద్దీ కండరాల బలం తగ్గడం సహజం, కానీ కొన్ని రోజువారీ అలవాట్లు ఈ ప్రక్రియను నెమ్మదించేలా చేసి, శరీరాన్ని దృఢంగా ఉంచుతాయి. ఈ వార్తలో, కండర దృఢత్వాన్ని నిలబెట్టడానికి నిపుణులు సూచించిన కొన్ని ముఖ్యమైన అలవాట్లను పరిశీలిద్దాం.

ప్రోటీన్ సమృద్ధిగా ఉన్న ఆహారం

కండరాల ఆరోగ్యానికి ప్రోటీన్ అత్యంత ముఖ్యం. రోజువారీ ఆహారంలో గుడ్లు, చికెన్, చేపలు, బీన్స్, మరియు పాల ఉత్పత్తుల వంటి ప్రోటీన్ ఆధారిత ఆహారాలను చేర్చడం వల్ల కండరాలు బలంగా ఉంటాయి. నిపుణుల అభిప్రాయం ప్రకారం, శరీర బరువు కిలోకు 1.2 నుండి 2 గ్రాముల ప్రోటీన్ తీసుకోవడం ఆదర్శం. ఉదాహరణకు, 70 కిలోల బరువు ఉన్న వ్యక్తి రోజుకు 84-140 గ్రాముల ప్రోటీన్ తీసుకోవాలి. ఇది కండరాల మరమ్మత్తు మరియు పెరుగుదలకు సహాయపడుతుంది.

నియమిత వ్యాయామం

కండర దృఢత్వాన్ని కాపాడుకోవడానికి వ్యాయామం కీలకం. బరువులు ఎత్తడం, రెసిస్టెన్స్ బ్యాండ్ వ్యాయామాలు, లేదా బాడీ వెయిట్ వ్యాయామాలు వంటివి కండరాలను బలోపేతం చేస్తాయి. వారానికి 2-3 సార్లు బల వ్యాయామాలు చేయడంతో పాటు, కార్డియో వ్యాయామాలు కూడా చేర్చడం వల్ల శరీరం చురుకుగా ఉంటుంది. యోగా లేదా పైలేట్స్ వంటి వ్యాయామాలు సమతుల్యత మరియు సౌలభ్యాన్ని మెరుగుపరుస్తాయి.

తగినంత నీరు తాగడం

కండరాలు సుమారు 75% నీటితో రూపొంది ఉంటాయి. శరీరంలో నీటి లోపం కండరాల బలహీనతకు దారితీస్తుంది. రోజుకు 2-3 లీటర్ల నీరు తాగడం వల్ల కండరాలు హైడ్రేటెడ్‌గా ఉండి, వాటి పనితీరు మెరుగవుతుంది. అలాగే, వ్యాయామం తర్వాత ఎలక్ట్రోలైట్ డ్రింక్స్ తీసుకోవడం కండరాల పునరుద్ధరణకు సహాయపడుతుంది.

నిద్ర మరియు విశ్రాంతి

కండరాల మరమ్మత్తు మరియు పెరుగుదలకు నిద్ర చాలా అవసరం. రోజుకు 7-8 గంటల నిద్ర కండరాల పునరుద్ధరణకు సహాయపడుతుంది. నిద్రలో శరీరం గ్రోత్ హార్మోన్‌ను ఉత్పత్తి చేస్తుంది, ఇది కండరాల బలాన్ని పెంచుతుంది. అలాగే, ఒత్తిడిని తగ్గించడానికి మెడిటేషన్ లేదా రిలాక్సేషన్ టెక్నిక్‌లు ఉపయోగపడతాయి.

విటమిన్ డి మరియు ఒమేగా-3

విటమిన్ డి కండరాల బలానికి మరియు ఎముకల ఆరోగ్యానికి అవసరం. ఉదయం సూర్యరశ్మి లేదా విటమిన్ డి సప్లిమెంట్లు తీసుకోవడం ఉపయోగకరం. అలాగే, ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, చేపలు లేదా ఫ్లాక్స్‌సీడ్ ఆయిల్‌లో లభిస్తాయి, ఇవి కండరాల శోథాన్ని తగ్గిస్తాయి.

ఈ రోజువారీ అలవాట్లను అనుసరించడం వల్ల 40 ఏళ్ల తర్వాత కూడా కండర దృఢత్వాన్ని నిలబెట్టుకోవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలితో చురుకైన జీవితాన్ని ఆస్వాదించండి!

# ఆహారంలో చిన్న మార్పు... ఆరోగ్యంలో పెద్ద ప్రయోజనం!

**రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పును సిఫార్సు చేస్తున్న ప్రపంచ ఆరోగ్య సంస్థ**
**రెట్టింపు ఉప్పు వినియోగిస్తున్న భారతీయులు**
**బీపీ, హార్ట్ అటాక్, స్ట్రోక్ వంటి ముప్పులకు దారితీస్తున్న వైనం**




ఆధునిక జీవనశైలిలో ఉప్పు వినియోగం శ్రుతి మించుతోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ రోజుకు 5 గ్రాముల కంటే తక్కువ ఉప్పును సిఫార్సు చేస్తుండగా, భారతదేశంలో చాలామంది దీనికి రెట్టింపు వినియోగిస్తున్నారని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి, మానవ శరీరానికి రోజుకు కేవలం 0.5 గ్రాముల ఉప్పు మాత్రమే అవసరం. ఈ అధిక వినియోగం రక్తపోటు, గుండె జబ్బులు, పక్షవాతం వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తోందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో ఉప్పు ప్రధాన ఆందోళన కలిగించే అంశం. చిరుతిళ్లు, ఇన్‌స్టంట్ నూడుల్స్, బ్రెడ్, సాస్ వంటి వాటితో పాటు, మన సాంప్రదాయ ఆహారాలైన అప్పడాలు, ఊరగాయలలో కూడా అధిక మొత్తంలో ఉప్పు ఉంటుంది. ఈ ప్రమాదాన్ని తగ్గించడానికి, ఆహార లేబుళ్లను జాగ్రత్తగా చదవడం, తక్కువ సోడియం ఉత్పత్తులను ఎంచుకోవడం, మరియు ఇంట్లో వండిన భోజనానికి ప్రాధాన్యత ఇవ్వడం అత్యవసరం. ఉప్పు తగ్గించడం వల్ల రక్తపోటు ప్రమాదాన్ని 25 శాతం వరకు తగ్గించవచ్చు. గుండె జబ్బులు, స్ట్రోక్ ముప్పు కూడా తగ్గుతుంది

ఉప్పు తగ్గించడానికి ఆచరణాత్మక చిట్కాలు

ఉప్పు వినియోగాన్ని తగ్గించడం ద్వారా గణనీయమైన ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇందుకు కొన్ని సులభమైన చిట్కాలు ఇక్కడ ఉన్నాయి:

లేబుళ్లను చదవండి: ప్యాక్ చేసిన ఆహార పదార్థాలు కొనేటప్పుడు వాటి లేబుళ్లపై ఉన్న సోడియం కంటెంట్‌ను తనిఖీ చేయండి. తక్కువ సోడియం లేదా సోడియం రహిత ఉత్పత్తులను ఎంచుకోండి.

ఇంటి భోజనానికి ప్రాధాన్యత: బయటి ఆహారం కంటే ఇంట్లో వండిన భోజనానికి ప్రాధాన్యత ఇవ్వండి. ఇంట్లో వండుతున్నప్పుడు ఉప్పు వినియోగాన్ని మీ నియంత్రణలో ఉంచుకోవచ్చు.

క్రమంగా తగ్గించండి: ఒకేసారి ఉప్పును పూర్తిగా తగ్గించకుండా, క్రమంగా దాని వినియోగాన్ని తగ్గించండి. మీ రుచి మొగ్గలు కొత్త రుచికి అలవాటు పడటానికి సమయం పడుతుంది.

ప్రత్యామ్నాయాలను వాడండి: ఉప్పుకు బదులుగా రుచి కోసం మూలికలు (కొత్తిమీర, పుదీనా), సుగంధ ద్రవ్యాలు (మిరియాలు, జీలకర్ర పొడి), నిమ్మరసం, లేదా వెనిగర్‌ను ఉపయోగించండి.

చిన్నప్పటి నుంచే అలవర్చండి: పిల్లలకు చిన్నప్పటి నుంచే తక్కువ ఉప్పుతో కూడిన ఆహారాన్ని అలవాటు చేయండి. ఇది వారి భవిష్యత్ గుండె ఆరోగ్యానికి పునాది వేస్తుంది.

కుటుంబంతో కలిసి ప్రయత్నం: కుటుంబ సభ్యులకు అధిక ఉప్పు వినియోగం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించి, వారిని కూడా తక్కువ ఉప్పు ఆహారం తినడానికి ప్రోత్సహించండి.

# ఢిల్లీలో కూలిన మరో బహుళ అంతస్తుల భవనం



దేశ రాజధాని ఢిల్లీలో మరో బహుళ అంతస్తుల భవనం కూలిపోయింది. ఇవాళ ఉదయం నార్త్ ఈస్ట్ ఢిల్లీలోని జనతా మజ్దూర్ కాలనీలో నాలుగు అంతస్తుల భవనం ఒక్కసారిగా కుప్పకూలింది. దీంతో అందులో నివాసం ఉండే వారు శిథిలాల కింద చిక్కుకుపోయారు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ టీమ్ ఇప్పటి వరకు నలుగురిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం తీవ్ర గాయాలైన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారు. అసలు బిల్డింగ్ కూలిన సమయంలో అందులో ఎంతమంది ఉన్నారు.. ప్రాణనష్టంపై మరింత సమాచారం ఇంకా తెలియాల్సి ఉంది. ఏప్రీల్ 19న ఢిల్లీ లోని ముస్తాఫాబాద్ ఓ నివాస భవనం కూప్పకూలి..ఒకే కుటుంబానికి చెందిన 11మంది శిథిలాల కిందపడి మృతి చెందారు. 11 మందికి తీవ్రగాయాలైన విషయం తెలిసిందే. ఆ ప్రమాద సమయంలో మొత్తంలో ఇంట్లో మొత్తం 22మంది ఉన్నారు.

# వర్సిటీ ఉత్సవంలో విద్యార్థిల అర్థనగ్న ప్రదర్శన

గోవా యూనివర్సిటీలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో మగవిద్యార్థులు కేవలం లోదుస్తులు ధరించి ఊరేగడంపై గోవా మానవ హక్కుల కమిషన్ వైస్ ఛాన్సిలర్ కు నోటీసులు జారీ చేసింది. ఈ సంవత్సరం ప్రారంభంలో ఈ సంఘటన చోటుచేసుకుంది. గురువారం కమిషన్ వైస్ – చాన్సలర్ హరిలాల్ బి మీనన్ కు నోటీసు జారీ చేసింది.జూలై 23 లోగా తమ ముందు హాజరై సమాధానం సమర్పించాలని కోరింది. ఫిబ్రవరిలో జరిగిన ప్రోలిక్ అనే ఇంటర్–డిపార్ట్ మెంటన్ ఫెస్టివల్ సందర్భంగా ఈ ఘటన జరిగిందని యూనివర్సిటీకి చెందిన సీనియర్ అధికారి తెలిపారు. థర్డ్ డిగ్రీ అనే అంశం సందర్భంగా జ్యూరీ పాల్గొనేవారిని లో దుస్తులవరకూ విప్పివేయాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఈ వారం ఓ దినపత్రికలో వచ్చిన రిపోర్ట్ ను హక్కుల కమిషన్ సూమోటోగా విచారణకు స్వీకరించింది. ఇది విద్యార్థుల మానవహక్కుల ఉల్లంఘనగా పరిగణించబడుతుందని కమిషన్ అభిప్రాయ పడింది. ఈ సంఘటననుఎన్ఎస్ యుఐ నాయకుడు నౌషాద్ చౌదరి ఖండించారు. ఈ ఉత్సవానికి మహిళా విద్యార్థులు కూడా హాజరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆ సమయంలో విద్యార్థులను బయటకు వెళ్లడానికి అనుమతించలేదని, దీంతో పురుష విద్యార్థులు మహిళా విద్యార్థినులు ఇబ్బంది పడ్డారని ఆయన తెలిపారు. ఎన్ యుఎస్ఐ ఈ ఘటనపై నిరసనలు ప్లాన్ చేస్తోంది.

# ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది నక్సల్స్ లొంగుబాటు


ఛత్తీస్‌గఢ్‌లో 22 మంది నక్సలైట్లు ఉన్నతాధికారుల ఎదుట లొంగిపోయ్యారు. వీరిపై కలిపి సంయుక్తంగా రూ 37 లక్షల పారితోషికం ప్రకటితం అయి ఉంది. నక్సల్స్ సరెండర్ విషయాన్ని సీనియర్ పోలీసు అధికారి ఒకరు మీడియాకు తెలిపారు. కుతుల్, నెల్నార్, ఇంద్రావతి ప్రాంత కేడర్‌లు ఇప్పుడు లొంగుబాట పట్టారు. నారాయణపూర్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో వీరు సీనియర్ పోలీసులు, బిఎస్ఎఫ్, ఐటిబిపి అధికారుల ఎదుట లొంగిపోయినట్లు తెలిపారు. తాము నక్సలిజం సిద్ధాంతాలతో విసిగిపోయ్యామని , అంతర్గత తగాదాలు ఎక్కువ అయ్యాయని వీరు పోలీసు , ఇతర అధికారులకు తెలియచేసుకున్నారు. వీరంతా ఇప్పుడు జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని జిల్లా ఎస్‌పి రాబిన్సన్ గురియా తెలిపారు. జిల్లాలోని మాడ్ ప్రాంతలో చేపట్టిన అభివృద్ధి పనుల పట్ల వీరు ఆకర్షితులు అయ్యారని, వీటిలో తమ వంతు పాత్ర పోషించేందుకు సిద్ధపడ్డారని, ఇది నక్సల్స్ సరెండర్ ప్రక్రియలో కీలక పరిణామం అని , దీనిని తాము స్వాగతిస్తున్నామని ఎస్‌పి చెప్పారు.

# సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉజ్జాయినీ మహంకాళి అమ్మవారి ని దర్శించుకున్నారు



**సికింద్రాబాద్ (ప్రజాబలం ప్రతినిధి నరేష్ )జూలై 13** మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఉజ్జాయినీ మహంకాళి అమ్మవారి ని దర్శించుకున్నారు. ఆషాడ బోనాల ఉత్సవాలలో భాగంగా ఆదివారం ఆయన సికింద్రాబాద్ లోని శ్రీ ఉజ్జాయినీ మహంకాళి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆయన కు ఆలయ పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరంఆలయపరిసరాలలో కలియ తిరుగుతూ భక్తులను ఆప్యాయంగా పలకరించి ఏర్పాట్లపై ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా భక్తులు ఇబ్బందులకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు. అమ్మవారి దర్శనం కోసం క్యూ లైన్ లో నిల్చున్న భక్తులకు వాటర్ బాటిల్స్ ను ఆయన పంపిణీ చేశారు.





## రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి: దయానంద్ ముదిరాజ్

వనపర్తి, జులై 13వనపర్తి నియోజకవర్గం నుండి పోటీ చేస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్ ముదిరాజ్, ఎన్నికలకు ముందు జర్నలిస్టులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.నిజమైన జర్నలిస్టులు ఎవరు?వారికి ఉండవలసిన అర్హత ప్రమాణాలు ఏమిటి, చట్టాలు ఏమి చెబుతున్నాయి? అక్రిడిటేషన్ ఉన్నవారు జర్నలిస్టులేనా? జర్నలిస్టులకు అక్రిడిటేషన్ చట్టబద్ధమైనదేనా? జర్నలిస్టు మరియు రిపోర్టర్ మధ్య తేడా ఏమిటి? అధికారులు నిజమైన జర్నలిస్టులను ఎలా గుర్తిస్తారు?గుర్తించడంలో ఎందుకు ఆలస్యం జరుగుతోంది. నిజమైన జర్నలిస్టులు ఎవరో రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా నిర్ణయించుకోవాలి. ప్రజా సమస్యలపై ఆర్.ఎన్. నేను, బ్రాడ్‌కాస్ట్ మీడియా కేబుల్ ఛానల్స్ రీజియన్ ప్రెస్ కౌన్సిల్ ఎంత మందికి అనుమతులు మరియు అర్హతలు ఉన్నాయి? అధికారులు పూర్తి నివేదిక ఇచ్చారా.... జర్నలిస్టులకు ఇచ్చిన హామీల అమలులో అలసత్వం ఉందని సమాచారం. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కొన్ని సోషల్ మీడియా ఛానెల్స్ తీవ్రంగా కృషి చేశాయి. మరి ప్రభుత్వం వారికి ఎలాంటి సహాయం అందిస్తుంది? జర్నలిస్టులు మరియు రిపోర్టర్ల సమస్యలు, హెల్త్ కార్డులు, సీనియర్ జర్నలిస్టులకు పెన్షన్లు, ప్రభుత్వ పథకాలలో ప్రాధాన్యత, ప్లాట్లు మరియు జర్నలిస్టులకు వారి స్వంత ఇళ్ల నిర్మాణం వంటి అంశాలను ప్రభుత్వం చేపడుతుందని చెబుతోంది. విద్యాసంస్థలలో జర్నలిస్టుల పిల్లలకు ఉచిత విద్య. ప్రతి మండల ప్రధాన కార్యాలయంలో ప్రెస్ క్లబ్. అక్రిడిటేషన్ లేని వారికి సంబంధిత ఐడి కార్డులను కూడా మంజూరు చేయాలి. నియోజకవర్గంలోని జర్నలిస్టుల సంక్షేమం కోసం ఆర్థిక నిధులు కేటాయించాలి. పరిశోధనాత్మక జర్నలిజం యొక్క ప్రాముఖ్యత పెరగాలి. ప్రభుత్వం మరియు ప్రజల మధ్య సమన్వయంలో జర్నలిస్టుల పాత్ర చాలా కీలకం. ప్రజా సమస్యలను తమ కలాల ద్వారా వినిపించాలని వారు కోరారు. జర్నలిస్టులు తమ చుట్టూ ఉన్న వ్యవస్థ ద్వారా ప్రభావితులు కాకూడదు. జర్నలిస్టులు తమకు తెలియకుండానే హామీలు ఇచ్చారని జర్నలిస్టు సంఘాలు ఫిర్యాదు చేస్తున్నాయి.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జులై 13 ప్రజాబలం ఇల్లందు నియోజకవర్గం** కామేపల్లి మండలం గరిడేపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ ధరావత్ రాంజీ మాతృమూర్తి ధరావత్ గమ్లి, రేపల్లెవాడ గ్రామానికి చెందిన భూక్య వీరన్న గారి తండ్రిగారైన భూక్య తావుర్య ఇటీవల వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మరణించారు. మాజీ జెడ్పీటిసి, డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. గ్రామాలలోని కొంతమంది అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ అంటే జీవనది లాంటిదని స్వాతంత్రం రాకముందు నుండి ఉన్న పార్టీ అని, మధ్యలో వచ్చిన పార్టీలు ఎలాంటి అభివృద్ధి చేయలేవని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే బడుగు బలహీన వర్గాల వారితో పాటు ఇతర వర్గాలకు సైతం శాశ్వతంగా గుర్తుండిపోయే పథకాలను అమలు చేస్తుందని దానిలో భాగంగా ఉచిత విద్యుత్తు, 108, ఫీజు రియంబర్స్మెంట్, రూపాయికి కిలో బియ్యం పథకం, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు గతంలో కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇచ్చిందని, రాష్ట్రంలో రేపటినుండి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి పథకం అమలవుతుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఏం చేయాలో తోచక అనవసర అబాండాలు వేస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, అంబడిపూడి సత్యం, గుగులోతు రవి భూక్య నాగేంద్రబాబు బొమ్మగాని ఉపేందర్, మేకల మల్లికార్జున్, ఉబ్బని నాగార్జున, బోడ రాజేష్ గుగులోత్ గోపి బట్టు నాను, బట్టు ఎన్టీఆర్ బట్టు రాము మరియు బంధువులు తదితరులు పాల్గొన్నారు


# మృతుల కుటుంబాలను పరామర్శించిన మేకల మల్లిబాబు యాదవ్



**ఇల్లందు ప్రతినిధి జులై 13 ప్రజాబలం ఇల్లందు నియోజకవర్గం** కామేపల్లి మండలం గరిడేపల్లి గ్రామానికి చెందిన తాజా మాజీ సర్పంచ్ ధరావత్ రాంజీ మాతృమూర్తి ధరావత్ గమ్లి, రేపల్లెవాడ గ్రామానికి చెందిన భూక్య వీరన్న గారి తండ్రిగారైన భూక్య తావుర్య ఇటీవల వృద్ధాప్య అనారోగ్య కారణాలతో మరణించారు. మాజీ జెడ్పీటిసి, డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ మరణించిన వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. గ్రామాలలోని కొంతమంది అడిగిన ప్రశ్నలకు సమాధానంగా కాంగ్రెస్ పార్టీ అంటే జీవనది లాంటిదని స్వాతంత్రం రాకముందు నుండి ఉన్న పార్టీ అని, మధ్యలో వచ్చిన పార్టీలు ఎలాంటి అభివృద్ధి చేయలేవని, కాంగ్రెస్ పార్టీ మాత్రమే బడుగు బలహీన వర్గాల వారితో పాటు ఇతర వర్గాలకు సైతం శాశ్వతంగా గుర్తుండిపోయే పథకాలను అమలు చేస్తుందని దానిలో భాగంగా ఉచిత విద్యుత్తు, 108, ఫీజు రియంబర్స్మెంట్, రూపాయికి కిలో బియ్యం పథకం, అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు గతంలో కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమే ఇచ్చిందని, రాష్ట్రంలో రేపటినుండి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రేషన్ కార్డుల పంపిణీ జరుగుతుందని, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు ఆర్డినెన్స్ తీసుకొచ్చిందని, మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా ప్రతి పథకం అమలవుతుంటే చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు ఏం చేయాలో తోచక అనవసర అబాండాలు వేస్తుందని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో ప్రతి కాంగ్రెస్ పార్టీ కార్యకర్త కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు షేక్ పతే మహమ్మద్, అంబడిపూడి సత్యం, గుగులోతు రవి భూక్య నాగేంద్రబాబు బొమ్మగాని ఉపేందర్, మేకల మల్లికార్జున్, ఉబ్బని నాగార్జున, బోడ రాజేష్ గుగులోత్ గోపి బట్టు నాను, బట్టు ఎన్టీఆర్ బట్టు రాము మరియు బంధువులు తదితరులు పాల్గొన్నారు


# ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దర్శించుకున్న కమిషనర్ ఆఫ్ పోలీస్, సి.వి. ఆనంద్





సికింద్రాబాద్: జులై 13సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల పండుగ జరుగుతున్న సందర్భంగా హైదరాబాద్ డిజి మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్, సి.వి. ఆనంద్ మరియు అధికారులతో కలసి ఆదివారం ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. తరువాత ఆలయాన్ని సందర్శించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసేందుకు క్యూ లైన్లు, రూట్ మ్యాప్‌లను పరిశీలించారు.

ఈ సందర్భంగా సి.వి. ఆనంద్ కమిషనర్ మాట్లాడుతూ, బోనాల ఉత్సవాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా అన్ని ముందస్తు చర్యలు చేపట్టినట్లు వివరించారు. చైన్ స్నాచర్లు, పిక్ పాకెటర్లు మరియు ఈవ్ టీజర్లను అదుపులో ఉంచడానికి సీసీటీవీ కెమెరాలు, క్రైమ్ బృందాలు మరియు షీ టీమ్ బృందాలతో పటిష్ట నిఘా ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

ఈ పర్యటనలో సి.వి. ఆనంద్ కమిషనర్ తో పాటు డి. జోయల్ డెవీస్ ఐపీఎస్ (జాయింట్ సీపీ ట్రాఫిక్), ఎస్. రష్మి పెరుమాల్ ఐపీఎస్ (డిసిపి నార్త్ జోన్), కె. అపూర్వారావు ఐపీఎస్ (డిసిపి స్పెషల్ బ్రాంచ్), శ్వేత ఐపీఎస్ (డిసిపి డిడి), రాహుల్ హెగ్డే ఐపీఎస్ (డిసిపి ట్రాఫిక్), రక్షితి కృష్ణ మూర్తి ఐపీఎస్ (డిసిపి హెడ్ క్వార్టర్స్), శిల్పా వళి ఐపీఎస్ (డిసిపి సెంట్రల్ జోన్), బి. బాలస్వామి ఐపీఎస్ (డిసిపి ఈస్ట్ జోన్),. ఎస్. చైతన్య కుమార్ (డిసిపి సౌత్ ఈస్ట్ జోన్), . వైవిఎస్. సుధీంద్ర (డిసిపి టాస్క్ ఫోర్స్) మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆందోల్ ముఖ్య కార్యకర్తల సమన్వయ సమావేశంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కార్యకర్తలకు విజ్ఞప్తి.



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 12 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా:రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సంగారెడ్డిలోని తన నివాసంలో, ఆందోల్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా కార్యాచరణను, రూపొందించుకోవాలని ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

ప్రజా ప్రభుత్వం అధికారలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను,దశలవారిగ అమలు చేస్తున్నమన్నారు. ఇందిరమ్మ ఇండ్లు, గృహజ్యోతి,రైతు భరోసా, భూభారతి, రైతుల రుణమాఫీ, రైతు భీమాలను, అమలు చేయడంతో పాటు, పెన్షన్లు, కొత్త రేషన్ కార్డుల,జారీ సన్నబియ్యం, ధాన్యం కొనుగోల్లు, సన్నాలకు 500,రూపాయల బోనస్ లాంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నమన్నారు. ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని అభివృద్ధిని ప్రజలకి వివరించాలని ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ, కార్యకర్తలను కోరారు. ఆందోల్ నియోజకవర్గం ఇతర నియోజకవర్గాలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తున్నామన్నారు. నియోజకవర్గంలో విద్య, వైద్య, రంగాల అభివృద్ధికి విశేష ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. ఇప్పటికే ఆందోల్ నియోజకవర్గం హెల్త్ ఎడ్యుకేషన్ల హబ్ గా తీర్చిదిద్దామన్నారు. నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నమన్నారు.ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారులను గుర్తించి



ఇంటింటికి వెళ్లి ప్రజా ప్రభుత్వం గత 18 నెలల్లో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వివరించాలని మంత్రి కోరారు. పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా,కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాలలో మండలాలలో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వ పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలా కృషి చేయాలని కోరారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నామన్నారు, అందులో భాగంగా రోడ్ల మరమ్మత్తులు , కొత్త రోడ్ల నిర్మాణం, పాఠశాలలలో, ఆసుపత్రులలో, మౌలిక సదుపాయాల కల్పనకు, పెద్దపీట వేస్తున్నమన్నారు. కేజీబీవీ, మోడల్ స్కూల్స్, సంక్షేమ హాస్టల్లో,జూనియర్, డిగ్రీ కళాశాలలో, నర్సింగ్ కళాశాలలో, పాలిటెక్నిక్ కళాశాలలో,విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నమన్నారు. నియోజకవర్గంలో కొత్తగా అడ్వాన్సు ట్రైనింగ్ ఇన్ ఇన్స్టిట్యూట్ను, డెవలప్మెంట్ సెంటర్లను స్కూల్లలోను, నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కార్యకర్తలకు వివరించారు.

ఆందోల్ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశంలో సిలారపు త్రిష దామోదర్ రాజనర్సింహ, పిసిసి ఉపాధ్యక్షులు సంగమేశ్వర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, పిసిసి సభ్యులు కిషన్, %సూవీజ% చైర్మన్లు సుధాకర్ రెడ్డి, జగన్మోహన్ రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్లు మల్లారెడ్డి, కచూర్ రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వివిధ మండలాల కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షులు,దిగంబర రావు, శేషారెడ్డి, రమేష్, నిమ్మ రమేష్ , బాలాజీ నర్సింహులు, పద్మనాభరెడ్డి, దశరథ్ , దుర్గారెడ్డి, పోలీసు కృష్ణ, ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం ఎమ్మెల్యే చింతా ప్రభాకర్




**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జులై 13(ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా:సంగారెడ్డి/ఉపాధ్యాయ వృత్తి సమాజానికి ఆదర్శం అని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు,పీచేర్యాగడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పట్లోళ్ల సురేష్ ఉద్యోగ విరమణ అభినందన సభను సంగారెడ్డిలో ఓ ఫంక్షన్ హాల్ నిర్వహించారు,తల్లిదండ్రుల తర్వాత స్థానం గురువుకు ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు,ఉద్యోగ విరమణ సందర్భంగా పట్లోళ్ల సురేష్ ను శాలువాతో సన్మానించారు,ఎమ్మెల్యే వెంట మాజీ సిడిసి చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి విజేందర్ రెడ్డి మాజీ కౌన్సిలర్ రామప్ప తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి వర్యా మా వసతి గృహం ఇది



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జూలై 13 ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా : పుల్కల్ మండల పరిధిలో గల ముదిమాణిక్యం, గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం, ఇది 15, ఏళ్ల కిందట అరకోర వసతులున్న అద్దె భవనంలో ప్రారంభించారు, అప్పటినుంచి ఇప్పటివరకు అందులోనే కొనసాగిస్తున్నారు, ప్రస్తుతం ఇక్కడ 70,మంది విద్యార్థులు వసతి పొందుతున్న, బాలురు అందులో ఉండడానికి భయపడుతున్నారు, భవనం శిథిలావస్థకు చేరి, వర్షానికి నీరు కారుతుండగా, గోడల్లోకి నీరు చేరి పెచ్చులు ఊడుతున్నాయి , ఈ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ, ప్రత్యేక చొరవ తీసుకొని, ఈ యొక్క వసతి గృహాన్ని మార్చాలని పిల్లల తల్లిదండ్రులు కోరుతున్నారు.....

# ఇప్పటికీ కార్టూనిస్ట్ శేఖర్ అవసరం ఉంది కార్టూనిస్ట్ శేఖర్ మెమోరియల్ అవార్డుల ప్రదానంలో వక్తలు




కార్టూనిస్ట్ శేఖర్ అవసరం సమకాలీన రాజకీయ పరిస్థితుల్లో కచ్చితంగా ఉందని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కార్టూనిస్ట్ శేఖర్ జన్మదినం సందర్భంగా ప్రతి ఏడాది ఇస్తున్న శేఖర్ మెమోరియల్ అవార్డు ప్రదానోత్సవ సభ ఆదివారం నాడు సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో జరిగింది. నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ శ్రీ మృత్యుంజయ, చిత్రకారులు శ్రీ చిత్ర 2025 సంవత్సరానికి గాను అవార్డులు అందుకున్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రజాశక్తి పూర్వ సంపాదకులు శ్రీ ఎస్. వినయ కుమార్ మాట్లాడుతూ కార్టూనిస్టులకు బొమ్మలు గీయడం ఒక్కటే తెలిస్తే సరిపోదని, సరైన రాజకీయ కామెంట్ ను కూడా దానికి జోడించే నైపుణ్యం ఉండాలని అన్నారు. శేఖర్ బొమ్మతో పాటు వ్యాఖ్యానం కూడా సరిపడా ఉండేదని, శేఖర్ తరువాత అలాంటి పదునైన బొమ్మల సంఖ్య తగ్గిపోతున్నదన్నారు. కార్టూనిస్టులకు సమకాలీన అంశాలతో పాటు సాహిత్యం మీద కూడా పట్టు ఉండాలని, అప్పుడే తాము చెప్పదలచుకున్న అంశాన్ని ప్రభావంతంగా చెప్పగలుగుతారని అభిప్రాయపడ్డారు.




తెలంగాణ విద్యావంతుల వేదిక ఛైర్మన్ శ్రీ తిప్పర్తి యాదయ్య మాట్లాడుతూ కార్టూనిస్ట్ శేఖర్ ఎక్కడ ఉంటే అక్కడ ఓ అర్థవంతమైన చర్చ ఉండేదని, ఎప్పుడు ఓ కొత్త ఆలోచనలు చేస్తూ సమాజ పురోగమనానికి తన వంతు ప్రయత్నం చేశాడని అన్నారు. నల్లగొండలో గోడలపై బొమ్మలతో పయనం మొదలు పెట్టి మెయిన్ స్ట్రీమ్ పత్రికల్లో పొలిటికల్ కార్టూన్ వేసే స్థాయికి శేఖర్ చేరిన విధానం ఎన్నో వ్యయప్రసాలకు ఓర్చిందని చెప్పారు. ఎ బ్రష్ అగైనెస్ట్ ప్రెజుడస్, ది ప్రొ పీపుల్ ఆర్ట్ ఆఫ్ శేఖర్ అనే అంశంపై సీనియర్ జర్నలిస్టు శ్రీ కె.వి. కూర్మనాథ్ స్మారకోపన్యాసం చేస్తూ ఇప్పుడున్న రాజకీయాలపై శేఖర్ కార్టూన్లు వేస్తే ఎప్పుడో అరెస్ట్ చేసే వారని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో గట్టిగా సాగుతున్న సమయంలోనే శేఖర్ గిదీ తెలంగాణ అనే పుస్తకం తెచ్చారని, క్యాస్ట్ క్యాన్సర్ అనే పుస్తకం తీసుకువచ్చి అగ్రకులాల మీద తన యుద్ధాన్ని ప్రకటించాడని గుర్తు చేశారు. సామాన్యుల సమస్యలను ఎలిగెత్తి చాటడంలో, దుర్మార్గాన్ని ఎదిరించడంలో కార్టూనిస్ట్ గా శేఖర్ ఎప్పుడూ వెనక్కి పోలేదని చెప్పారు.

అవార్డు గ్రహీతలు శ్రీ మృత్యుంజయ మాట్లాడుతూ కార్టూనిస్ట్ శేఖర్ ను చూసి చాలా విషయాలు నేర్చుకున్నామని, జీవితంలో చెప్పినవన్నీ ఆచరించడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశారని అన్నారు. కార్టూన్ కు ఉన్న ప్రయోజనాన్ని విస్తృతం చేసిన వ్యక్తి శేఖర్ అని, అలాంటి వ్యక్తి స్మారకార్థం ఇస్తున్న అవార్డును తీసుకుంటున్నందుకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. మరో అవార్డు గ్రహీత సీనియర్ చిత్రకారులు శ్రీ చిత్ర మాట్లాడుతూ శేఖర్ బతికుండగా ఆయనకు ఒక బొమ్మ గీసి ఇవ్వలేకపోయానని, ఆ చనిపోయిన వార్త తెలిసాక బాధతోనే ఒక బొమ్మ గీశానని చెప్పారు. ప్రజల కోసం పాటు పాడే కార్టూనిస్టుగా శేఖర్ ఎంతో ఎత్తుకు ఎదిగారని, ఆయన గుర్తుగా ఓ అవార్డు తీసుకోవడం జీవితంలో మరచిపోలేని విషయమన్నారు. కార్టూనిస్ట్ శంకర్ మాట్లాడుతూ తనకు ముగ్గురు గురువులు ఉంటే అందులో మొదటి గురువు శేఖరే అని, ఆయనతో ఉంటే ఓ ఉద్యమాన్ని నడిపించేనట్లు ఉంటుందని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన ఉస్మానియా విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రఘు మాట్లాడుతూ శేఖర్ ఏ విషయాన్నైనా నిర్భయంగా చెప్పేవాడని, యాజమాన్యాలు ఎంత వత్తిడి చేసినా తాను నమ్మిన అంశాల కోసం బలంగా పనిచేశాడని అన్నారు. ప్రముఖ పాటల రచయిత, గాయకులు శ్రీ చింతల యాదగిరి శేఖర్ తో తనకు ఉన్న పరిచయాన్ని గుర్తుకు చేసుకుంటూ శేఖర్ స్మరణ కోసం రాసిన పాటను ఆలపించారు. శేఖర్ కుమారుడు నందు వందన సమర్పణ చేయగా, మరో చిత్రకారులు శ్రీ కూరెళ్ళ శ్రీనివాస్, శేఖర్ సతీమణి శ్రీమతి చంద్రకళా శేఖర్ కూడా పాల్గొన్నారు. శేఖర్ అవార్డు కింద 10,116 రూపాయాల నగదు, ప్రశంసాపత్రం, జాపికను అందచేశారు. ఇప్పటి వరకు ప్రముఖ కార్టూనిస్టులు సురేంద్ర, సుభాని, శంకర్, నర్సిం గతంలో అవార్డులు అందుకున్నారు.

# మండల కేంద్రంలో పస్కా పండుగ వేడుకలు



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 13 ప్రజాబలం )**సంగారెడ్డి జిల్లా : నియోజకవర్గ పరిధిలో గల చౌటకూర్ మండల కేంద్రంలో దక్షిణ ఇండియా సంఘం (సిఎస్ఐ) ఆధ్వర్యంలో ఘనంగా పస్కా పండుగ వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా గ్రామంలోని సంఘస్తులు అందరూ కలిసి, చర్చి నుంచి గ్రామ శివారులో గల, పచ్చని పొలాలకు వెళ్లి పండుగను ఆచరించారు, ఈ వేడుకల్లో ప్రెస్బీటర్ ఇంచార్జి రేవ, ఎం ,రవికుమార్,రెవ, భాస్కర్, మధు,గురువులు పాల్గొన్నారు, ఈ పస్కా పండుగకు ముఖ్య అతిథిగా తోగర్ పల్లి ప్రస్బైటర్ ఇంచార్జి గురువులు మదుకుమార్,హాజరై మాట్లాడుతూ,ఐగుప్తు దేశంలో ఇశ్రాయేలీయులు, బానిసత్వంలో ఉన్నప్పుడు దేవుడు మరణాన్ని తప్పించడానికి పస్కాను ఏర్పాటు చేసినాడని అన్నారు, గొర్రె నైనా, మేకనైనా,బలిదానం చేసి, దాన్ని వండుకొని కుటుంబాల వారిగా తినాలని, దాని రక్తం గృహప్రకారణాలకు, గుర్తులుగా ఏర్పాటు చేసి, పస్కా పండుగను ఆచరించాలని,వాక్యోపదేశం చేశారు,ఈ కార్యక్రమంలో పాస్టర్ రేట్ కమిటీ సభ్యులు, సంఘ పెద్దలు,సండే స్కూల్ పిల్లలు, పాల్గొని సంతోషంగా ఆటలాడుతూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు....


# కలివి వనం మూవీ టీం వేములవాడలో సందడి. బద్ది పోచమ్మకు బోనం సమర్పించిన హీరోయిన్ నాగ దుర్గ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఏ ఆర్ ప్రొడక్షన్ బ్యానర్ పై నిర్మితమై త్వరలో విడుదల కాబోతున్న పక్కా ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ తెలుగు చలనచిత్రం కలివి వనం టీం సభ్యులు దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ పట్టణంలో సందడి చేశారు. మూవీ సభ్యులందరూ కలిసి ఆషాడ మాసం సందర్భంగా శ్రీ బద్ది పోచమ్మ అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు రాజు నరేంద్ర తో పాటు హీరోయిన్ నాగ దుర్గ మాట్లాడుతూ మల్లికార్జున్ రెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డిల నిర్మాణ సారధ్యంలో గ్రామీణ నేపథ్యంతో పాటు చిన్నారులే ఇతివృత్తంగా తీసిన ఈ సినిమా త్వరలోనే విడుదల కాబోతుందని, ఫ్యామిలీ ఎంటర్టైన్మెంట్ గా, చిన్నారులను ఆకట్టుకునేలా ముందుకు వస్తున్నా ఈ సినిమాను ప్రజలందరూ సినిమా టాకీసులలో చూసి ఆదరించాలని కోరారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుంది

**అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు**
**ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తాం...**
**విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**
**ప్రజలకు అందుబాటులో అధికార యంత్రాంగం**
**రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క**







**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 13** : రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు.ఆదివారం జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య,వైద్య, కుటుంబ సంక్షేమ,శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ-మద్యనిషేధ, పర్యాటక,సాంస్కృతిక శాఖ మంత్రి-జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల నియోజకవర్గ శాసన సభ్యులు కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు,జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్,జి.సి.సి.చైర్మన్ కొట్నాక తిరుపతి,కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్,డిసిసి అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ ప్రేమ్ సాగర్ రావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టిందని,ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్., డి.ఎం.ఎఫ్.టి.నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల,ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత,పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరిగిందని తెలిపారు.డైట్ చార్జీలు 40 శాతం,కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి నూతన మెనూ ఖచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ...ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరుగుతుందని,90 శాతం బ్యాంకు రుణం,10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుందని తెలిపారు. నర్సింగాపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్.నిధులతో 2/200 కి.మీ. నుండి 3/100 కి. మీ. కొరకు 900 మీటర్ల మేర సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. 80 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు,48 లక్షల రూపాయలతో 4 అంగన్వాడి భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్.సి.ఎస్.డి.ఎఫ్. క్రింద సి.సి.రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు.హాజీపూర్ మండలం చిన్న గోపాల్ పూర్,ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్.టి.ఎస్.డి.ఎఫ్., ఎస్.సి.ఎస్.డి.ఎఫ్ నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేంపల్లి, పోచంపహాడ్ శివారులలో 212 ఎకరాల భూమి విస్తీర్ణంలో 30 కోట్ల రపాయల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఐ. టి./ ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా ఆర్థిక అభివృద్ధి కోసం సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణంగా అందించేందుకు చర్యలు తీసుకుంటామని, మొదటి సంవత్సరం 21 వేల 632 కోట్ల రూపాయలు అందించడం జరిగిందని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్. టి. సి. బస్సులు నడిపించేందుకు 600 బస్సుల ప్రతిపాదనలో 150 బస్సులను ఇవ్వడం జరిగిందని, త్వరలో 450 బస్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు,పెరటి కోళ్ల పెంపకం, పాల డైరీ, పెట్రోలు బంకుల నిర్వహణ, మహిళా శక్తి భవనాల ఏర్పాటు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా 70 లక్షల రైతు కుటుంబాలకు రైతు భరోసా క్రింద 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి సహాయం అందించడం జరిగిందని, 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడంతో పాటు పంట నష్టపరిహారం అందించడం జరిగిందని తెలిపారు. 29 లక్షల పంప్ సెట్లను 17 వేల కట్ల రూపాయలతో ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందించడం జరిగిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని తెలిపారు. అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో లబ్ధిదారులకు అందించడం జరుగుతుందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందించడం జరుగుతుందని తెలిపారు. పేదింటి ఆడపిల్లల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా డబ్బులు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి మొదలు పెడతామని,రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కొరకు ఆర్థిక చేయూత అందించడం జరుగుతుందని తెలిపారు. ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా 6 లక్షల 70 వేల ఎకరాలకు సోలార్ పంపుసెట్లను అమర్చడం జరిగిందని తెలిపారు.ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ...మంచిర్యాల జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను ప్రారంభించడం జరిగిందని, ప్రారంభించిన అతి తక్కువ కాలంలో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయిందని తెలిపారు. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కొరకు హాజీపూర్ మండలం వేంపల్లి లో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేయబడి పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.జిల్లాలోని 863 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 80 కోట్ల రూపాయల చెక్కులు అందజేశారు.8 మంది ప్రమాద బీమా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 10 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. రుణ బీమా సంబంధించి 73 లక్షల 37 వేల రూపాయలను 83 మంది సభ్యులకు అందజేశారు. వడ్డీ లేని రుణాలు 8 వేల 750 మందికి 17 కోట్ల 78 లక్షల రూపాయలు ఇవ్వడం జరిగిందని తెలిపారు.

అనంతరం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో 212 ఎకరాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు కొరకు భూమి పూజ నిర్వహించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా రాబోయే రోజులలో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని, పెద్ద మొత్తంలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని తెలిపారు.అటవీ శాఖ సంబంధించిన నూతన వాహనాలను ప్రారంభించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సంబంధిత అధికారులను, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ రాజ్ శాఖ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్,లక్షెట్టిపేట,దండేపల్లి మండల అధ్యక్షుడు పింగళి రమేష్,అక్కల వేంకటేశ్వర్లు, మాజీ ఎంపిపి గడ్డం శ్రీనివాస్ వైఎస్ ఎంపిపి ఆకుల రాజేందర్, ఎంపీటీసీలు ముత్యాల శ్రీనివాస్,తోట మోహన్ ముత్తే నారాయణ, మొటపలుకుల గట్టయ్య,లక్షెటిపేట ఫ్లోర్ లీడర్ చెల్లా నాగభూషణం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ ఆరిఫ్,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేల రాజు,సీరియస్ నాయకులు ముద్దసాని వేణు,ముత్తే వేంకటేష్,కారుకురి సత్యం,మాజీ ఎంపీటీసీ, మాజీ సర్పంచ్ లు,వివిధ గ్రామాల ప్రజలు,మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మహా దిష్టికుంభ కార్యక్రమం హాజరైన చల్మెడ.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ఆదివారం రోజున వేములవాడ పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారికి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఘనంగా మహా దిష్టి కుంభ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బి ఆర్ ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు, రాజన్న సిరిసిల్ల జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తోట ఆగయ్య, సీనియర్ నాయకుడు ఏనుగు మనోహర్ రెడ్డిలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రామతీర్థపు రాజు, పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మ శెట్టి విజయ్, మారం కుమార్, నరాల శేఖర్, జోగిని శంకర్, సిరిగిరి చందు, గోలి మహేష్, నాయకులు నీలం శేఖర్, కొండ కనకయ్య, మల్లేశం, హింగే కుమార్, పోతు అనిల్ కుమార్, మంత సందీప్, గోపు మధు, రాకేష్, విజయ్ యాదవ్, సాయి పటేల్, ఆర్యవైశ్య పట్టణ అధ్యక్షుడు సిద్ధంశెట్టి వేణు, ఆర్యవైశ్య నాయకులు మాడిశెట్టి కృపాల్, చేపూరి రవీందర్, పైడా శ్రీనివాస్, చీకోటి శ్రీహరి, చీకోటి నాగరాజు, కొమ్ము నటరాజ్, కటకం శ్రీనివాస్, తాటికొండ రాంబాబు, డాక్టర్ వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

## రాజన్న ఆలయ ఉద్యోగుల వనమహోత్సవం కార్యక్రమం.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఉత్తర్వుల అనుసరించి దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం యందు తేదీ 13-07-2025 ఆదివారం రోజున ఆలయ కార్యనిర్వాణాధికారి రాధాబాయి ఆధ్వర్యంలో యావన్మంది ఆలయ సిబ్బంది కలిసి వన మహోత్సవం కార్యక్రమం చేపట్టనైనది. దేవస్థానం కు సంబంధించిన గురువయ్య నగర్ సమీపంలో గల భూమిలో వివిధ రకాల చెట్లు నాటడం జరిగింది.

ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాణాధికారి తో పాటు, కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాక ఇంజనీర్, సహాయక ఇంజనీర్, సహాయ కార్యనిర్వాహణాధికారులు, పర్యవేక్షకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## రాజన్న ఆలయంలోని పలు విభాగాలను తనిఖీ చేసిన ఈవో రాధాబాయి.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించిన, శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం, గోశాలలో అభివృద్ధి పనులను, బద్ది పోచమ్మ ఆలయం, భీమేశ్వర సదన్ వసతి గృహాలను ఈవో రాధాబాయి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో పనిచేసే సిబ్బందికి పలు సూచనలు చేస్తూ, సమయపాలన పాటించాలని, భక్తులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. రాజన్న భక్తులకు ఇబ్బంది కలిగితే సంబంధిత ఉద్యోగులపై చర్యలు తీసుకుంటానని ఆమె తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

## రాజన్నను కుటుంబ సమేతంగా దర్శించుకున్న పరకాల ఎమ్మెల్యే.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని ఆదివారం రోజున పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చక స్వాములు స్వస్తితో స్వాగతం పలికారు. స్వామివారికి ప్రీతికరమైన కోడె మొక్కులు చెల్లించుకున్నారు. నాగిరెడ్డి మంటపంలో వేద పండితులు ఆశీర్వదించగా అర్చకులు శేష వస్త్రము కప్పి, స్వామి వారి లడ్డు ప్రసాదం ఎమ్మెల్యేకు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ప్రోటోకాల్ ఏఈఓ జి.అశోక్ కుమార్, ఆలయ ఇన్స్పెక్టర్ రాజేందర్, సింహాచారి, మేకల వెంకటేష్ మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మ నేను చనిపోతున్న, బ్రతకాలని లేదు.

## వలస జీవి ఆత్మహత్య.
## కడసారి చూపునకు నోచుకోని కుటుంబ సభ్యులు.
## ముస్తాబాద్ లో వలస జీవి ఖననం.



**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ముస్తాబాద్, ( ప్రజాబలం ),** కన్న తల్లిదండ్రులను, కట్టుకున్న భార్య పిల్లలను పోషించుకునేందుకు పొట్ట చేత పట్టుకొని రాష్ట్రాలు దాటి వచ్చిన వలస జీవి అర్ధాంతరంగా తనువు చాలించాడు. కడసారి చూపు కోసం పరితపించిన కుటుంబ సభ్యులు. మృతదేహాన్ని తరలించిపోయేందుకు డబ్బులు లేక ముస్తాబాద్ లో ఖననం చేసేందుకు అంగీకరించడం విషాదకరం. ముస్తాబాద్ ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి లో బచ్చు చౌదరి (33) అనే వలస కూలి శుక్రవారం రాత్రి చెట్టుకు ఉరి వేసుకున్నాడు.

పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లా చోటు పూర్ వెస్ట్ పారాకు చెందిన బచ్చు చౌదరి పది రోజుల క్రితం చీకొడుకు మేస్త్రి పనులు చేసేందుకు వచ్చాడు. ఈ నేపథ్యంలో స్వగ్రామంలో నీ కుటుంబ సభ్యుల గురించి ఆందోళన చెందాడు. తన తల్లికి ఫోన్ చేసి అమ్మ నేను చనిపోతున్న, బ్రతకాలని లేదు అంటూ చెప్పి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన తోటి కార్మికులు బచ్చు చౌదరిని ఆసుపత్రికి తరలించే లోగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు, తల్లి ఉన్నారు. మృతదేహాన్ని పశ్చిమ బెంగాల్ కు తరలించాలంటే లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతుందని, తినేందుకు తిండి లేక ఇబ్బంది పడుతున్నామని కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. బచ్చు చౌదరికి అంతిమ సంస్కారాలు ముస్తాబాద్ లోనే నిర్వహించాలని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతం అవుతూ తెలిపారు. ఎస్సై గణేష్ ముస్తాబాద్ లోనే అంతిమ సంస్కారాలు నిర్వహించారు. మృతుని స్నేహితుడు బిష్ణు చౌదరి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

# కోటా మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు.
## రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** ప్రముఖ తెలుగు చలనచిత్ర నటుడు కోటా శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. విలక్షణమైన పాత్రల్లో తన నటనతో 750 కి పైగా సినిమాలలో నటించి ఎంతోమంది ప్రేక్షకులను మెప్పించారని గుర్తు చేసుకున్నారు. కోటా శ్రీనివాసరావు గారి మృతి సినీ లోకానికి తీరనిలోటని ఆయన అన్నారు. వైవిధ్య భరితమైన పాత్రలతో సినీ ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారని, సుమారు నాలుగు దశాబ్దాల పాటు సినీ, నాటక రంగాలకు ఆయన చేసిన కళాసేవ, ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయం అన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ తన ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని తెలిపారు.ఖ

# అవగాహన లేకపోవడమే సైబర్ నేరాలకు కారణం
## -మందమర్రి ఎస్సై శివనీతి రాజశేఖర్




**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 13:** అత్యాశ, అవగాహన లేకపోవడం వలనే సైబర్ నేరాలు పెరుగుతున్నాయని మందమర్రి ఎస్సై రాజశేఖర్ అన్నారు. సైబర్ నేరాల నియంత్రణకు స్వీయ అప్రమత్తత, అవగాహన కలిగి ఉండటం అత్యంత అవసరమని ఆదివారం ఆయన ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు.

ప్రజలు 'డిజిటల్ అరెస్ట్' అనగానే భయపడవద్దని, అలాంటి కాల్స్ వస్తే నిర్భయంగా స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అలాగే యువత ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల జోలికి వెళ్ళవద్దని ఎస్సై గట్టిగా హెచ్చరించారు. సోషల్ మీడియా ద్వారా వచ్చే అనధికారిక లింకుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాటిని క్లిక్ చేసి మోసపోవద్దని తెలిపారు. ఈ మధ్య కాలంలో కొంత మంది సైబర్ నేరగాళ్లు నకిలీ PM కిసాన్', SBI రివార్డ్' వంటి పేర్లతో ఏపీకే ఫైల్స్ (%apk files%) ను వాట్సాప్, టెలిగ్రామ్ మరియు ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా పంపిస్తున్నారని తెలిపారు. పొరపాటున ఇలాంటి లింక్స్ క్లిక్ చేసి అప్లికేషన్ ఇన్‌స్టాల్ చేస్తే మీ ఫోన్ హ్యాక్ అయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. దీని ద్వారా మీ ఫోన్‌లోని %ూూ%లు, బ్యాంక్ వివరాలు మరియు వ్యక్తిగత సమాచారం సైబర్ నేరగాళ్ల ఆధీనంలోకి వెళతాయన్నారు. ఆ తర్వాత నేరగాళ్లు బాధితుడి వాట్సాప్ ఖాతాను హైజాక్ చేసి, అదే నకిలీ లింక్‌ను అతని కాంటాక్ట్స్‌లో ఉన్న వారందరికీ ఆటోమేటిక్‌గా పంపిస్తారని వివరించారు. ఈ మోసాల ద్వారా బాధితులు తీవ్రమైన ఆర్థిక నష్టాలకు, వ్యక్తిగత డేటా చోరీకి గురవుతారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇలాంటి నకిలీ APK ఫైల్స్ మోసాల బారిన పడకుండా ఉండాలంటే ప్రజలు వాట్సాప్‌లో వచ్చే అనుమానాస్పద లింక్‌లను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయరాదని అన్నారు. »PM KISAN' యోజన లేదా 'SBI Rewards' పేరుతో APK లింక్స్ వస్తే వాటిని వెంటనే డిలీట్ చేయాలని పేర్కొన్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారం, బ్యాంక్ వివరాలు లేదా ఓటీపీలను ఎవరితోనూ షేర్ చేయవద్దని సూచించారు. ప్రభుత్వ సంస్థలు గానీ, బ్యాంకులు గానీ ఇటువంటి సున్నితమైన సమాచారాన్ని ఫోన్ల ద్వారా ఎన్నడూ అడగవని స్పష్టం చేశారు.

సైబర్ క్రైమ్ నేరాల పట్ల ప్రజలు ఎంత అవగాహన కలిగి ఉంటే, వాటిని అంత సమర్థవంతంగా తగ్గించవచ్చని, కావున ప్రతి ఒక్కరూ ఈ విషయాలపై అవగాహన పెంచుకోవాలని ఆయన కోరారు.

# సదాశపేటలో నకిలీ ఆర్ఎంపిల హవా...



**సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి జులై 13 ( ప్రజాబలం )** సంగారెడ్డి జిల్లా:సదాశివపేట/పట్టణంలో నకిలీ ఆర్ఎంపీల హవా,ప్రతమ చికిత్స శిక్షణ చేయాకున్న ప్రథమ చికిత్స అనుమతి పత్రం లేకున్నా వైద్యం చేస్తారు,కనీసం ఏ రోగానికి ఏ మాత్రలు ఇవ్వాలో కూడా తెలియదు కాని సొంత మెడికల్ షాపులు నిర్వహిస్తూ అవసరం లేని మాత్రలు ఇస్తూ అమాయకుల నుండి డబ్బులు లాగుతున్నారు,మమ్మల్ని ఎవడు ఏం చేస్తాడు అనే అహంకారంతో మేము చేసేదే వైద్యం అనేలా నిజమైనా డాక్టర్లకు సవాల్ విసురుతున్నారు,జిల్లా వైద్యం అధికారులు తనిఖీలు నిర్వహించే సమయంలో దొంగలల దాచుకొని వారం రోజులు కనపడకుండా ఉంటారు, విషయం సద్దు మనిగిన తరువాత యద్దేచగా ప్రథమ చికిత్సలు చేస్తూ తమ దందా కొనసాగిస్తున్నారు,ఇప్పటికైనా జిల్లా వైద్య అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి వికృత దందాలను అడ్డుకొని ప్రజల ప్రాణాలను కాపాడాలని పట్టణ వాసులు కోరుకుంటున్నారు.

# ఆషాడ మాస వనభోజనాలు






**రాజన్న సిరిసిల్ల జిల్లా జూలై 13 (ప్రజాబలం ప్రతినిధి)** సిరిసిల్ల పట్టణంలోని శ్రీ సీతారామాలయ ఆర్యవైశ్య వాడకట్టు సంఘం అధ్యక్షులు పోకల వేణుగోపాల్ దంపతులు ఆధ్వర్యంలో సంఘ సభ్యుల ఫ్యామిలీతో ఉదయం ఆరు గంటల 30 నిమిషాలకు బయలుదేరి సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గం లోని చౌదరిపల్లి గ్రామంలో ఎంతో ప్రసిద్ధిగాంచిన మహిమగల శివాలయంలో స్వామివారికి అభిషేకాలు జరిపించి ఆశీర్వాదం ఇప్పించారు అనంతరం అల్పాహారం , భోజనం ఏర్పాట్లు చాలా ఘనంగా నిర్వహించినారు ఇందులో భాగంగా తిరుగు ప్రయాణంలో దుబ్బాక పట్టణంలోని ప్రసిద్ధిగాంచిన శ్రీ బాలాజీ దేవాలయంలో స్వామివారిని దర్శించుకుని అల్పాహారం సేవించి సిరిసిల్ల పట్టణకు బయలుదేరినారు

ఇందులో భాగంగా శ్రీ సీతారామ ఆర్యవైశ్య వాడకట్టు మహిళా సంఘం కి ఈరోజు చేపూరి జమున - బుచ్చయ్య ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు సంఘ సభ్యులు, మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఘనంగా సన్మానించి వారికి శుభాకాంక్షలు తెలియజేశారు

# అక్రమ మట్టి ఇసుక రవాణా పై కఠిన చర్యలు :
## జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ



***<u>అక్రమంగా తరలిస్తున్న 10 మట్టి త్రవ్వే యంత్రాలు మరియు వాహనాలు సీజ్</u>***

***<u>మట్టి రవాణా చేసే వారి పై కేసులు నమోదు చేసిన వేములవాడ ఆర్డీఓ</u>***

**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 13: (ప్రజాబలం ప్రతినిధి)** జిల్లాలో అక్రమ మట్టి మరియు ఇసుక చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.వేములవాడ రూరల్ మండలంలోని కొడి ముంజ అనుపురం గ్రామ పరిసరాల్లో అక్రమ రవాణా చేస్తున్న 10 మట్టి త్రవ్వే యంత్రాలు మరియు వాహనాలను వేములవాడ ఇంచార్జి ఆర్డీఓ రాధాబాయి ఆదివారం సాయంత్రం సీజ్ చేశారు.ఇందిరమ్మ ఇళ్లకు అని బ్యానర్ తో అక్రమంగా తరలిస్తున్న మట్టి 4 టిప్పర్లు 2 ట్రాక్టర్లు 2 జెసిబి లు 2 హిటాచి యంత్రాలను వేములవాడ ఆర్డీఓ రాధాభాయి సీజ్ చేసి వారి పై కేసులు నమోదు చేశారూ.జిల్లాలో ఎవరు అనుమతి లేకుండా అక్రమ మట్టి మరియు ఇసుక రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా హెచ్చరించారు.

# సింగపూర్ పర్యటనకు వెళుతున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు త్వరలో ఈ నెల 26న సింగపూర్ పర్యటనకు వెళుతున్నారు. ఈ నెల 30 వరకు ఆయన పర్యటన సాగనుంది. రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఆయన ఈ పర్యటనకు సిద్ధమవుతున్నారు. ఈ పర్యటనలో చంద్రబాబుతో పాటు మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్, నారాయణ, ఉన్నతాధికారులు కూడా పాల్గొంటారు.సింగపూర్ పర్యటనలో చంద్రబాబు బృందం అక్కడి ప్రభుత్వ పెద్దలతో మరియు వివిధ వ్యాపార సంస్థల ప్రతినిధులతో సమావేశం కానుంది. ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న పెట్టుబడి అవకాశాలను వారికి వివరించడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను కూడా తెలియజేస్తారు. ముఖ్యంగా ఐటీ, ఎలక్ట్రానిక్స్, పునరుత్పాదక ఇంధనం మరియు మౌలిక సదుపాయాల రంగాలలో పెట్టుబడులను ఆకర్షించడానికి ప్రయత్నాలు జరగనున్నాయి.రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి తీవ్రంగా కృషి చేస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు చేస్తున్న విదేశీ పర్యటనలు రాష్ట్రానికి ఎంతో ముఖ్యమైనవిగా భావిస్తున్నారు. గతంలో కూడా ఆయన పలుమార్లు విదేశాల్లో పర్యటించి భారీ ఎత్తున పెట్టుబడులను రాష్ట్రానికి తీసుకురావడంలో సఫలమయ్యారు. సింగపూర్ పర్యటన కూడా అదే కోవలో జరుగుతుందని భావిస్తున్నారు.ఈ పర్యటన ద్వారా సింగపూర్ మరియు ఆంధ్రప్రదేశ్ మధ్య సంబంధాలు మరింత బలపడతాయని ఆశిస్తున్నారు. అంతేకాకుండా, సింగపూర్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరియు ఉత్తమ విధానాలను కూడా స్వీకరించడానికి ఈ పర్యటన ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com